

కనిగిరిలో యడవల్లి లక్ష్మణరావు స్వగృహం



యడవల్లి లక్ష్మణరావు

కనిగిరి వాసికి న్యాయ కిరీటం

- హైకోర్టు న్యాయమూర్తిగా డాక్టర్ లక్ష్మణరావు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు, బంధువులు

'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు' అనే నానుడి ఆయనకు అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. నిరాడంబరం, నిజాయితీ ఆయనకు నిలువెత్తు ఆభరణాలు. మాటలో ముక్కుసూటితనం, నిర్ణయంలో కచ్చితత్వం ఆయన కీర్తి కిరీటాలు. వీటన్నిటినీ కలబోసి చెబితే వచ్చే పేరే డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన జిల్లాలోని కనిగిరి వాసి కావడంతో ఆ ప్రాంతంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

కనిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హైకోర్టు జడ్జిగా కనిగిరికి చెందిన డాక్టర్ యడవల్లి లక్ష్మణరావు నియమితులయ్యారు. దీంతో స్థానికులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1975లో కనిగిరిలో జన్మించిన ఆయన పద్మావతి, వెంకటేశ్వర్లుకు రెండో సంతానం. ఆయనకు అక్క, తమ్ముడు ఉన్నారు. తండ్రి వెంకటేశ్వర్లు ఆర్అండ్‌బీ శాఖలో సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు. లక్ష్మణరావు ప్రాథమిక విద్య కనిగిరిలో జరిగింది. 6వ తరగతి నుంచి 8 వరకు పొదిలిలో అభ్యసించారు. ఆయన తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావటంతో వివిధ ప్రాంతాలకు ఉద్యోగరీత్యా బదిలీ కావాల్సి వచ్చేది. దీంతో లక్ష్మణరావు విద్యాభ్యాసం గిద్దలూరు, నెల్లూరు ప్రాంతంలో సాగింది. నెల్లూరులోని వీఆర్ కళాశాలలో ఎల్ఎల్‌బీ చదివారు. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు. న్యాయ వృత్తిలో క్రిమినల్ కేసుల వాదనలో పేరు, ప్రఖ్యాతులు సంపాదించారు.

కావలిలో ఏపీపీగా..

మొదటగా డాక్టర్ లక్ష్మణరావు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కావలిలో చేరారు. ఆ తర్వాత సూళ్లూరుపేటకు బదిలీపై వెళ్లారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి ఏలూరులో జిల్లా జడ్జిగా నియమితుల య్యారు. అనంతపురం, మచిలీపట్నంలలో పనిచేశారు. 2021లో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పదోన్నతి పొందారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర హైకోర్టు జడ్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లక్ష్మణరావు సోదరుడు పవన్‌కుమార్ ఇటీవలే మణిపూర్ రాష్ట్రంలోని సెంట్రల్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. కనిగిరి ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఉన్నతస్థానానికి చేరుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కనిగిరిలో శాశ్వత నివాసం

కనిగిరిలోని ఎన్జీవో కాలనీలో లక్ష్మణరావు స్వగృహం ఉంది. పండుగలకు, శుభకార్యాలకు వచ్చి వెళ్తుంటారు. నాలుగు రోజుల క్రితం సంక్రాంతి పండుగను ఆయన కుటుంబసభ్యులంతా కనిగిరిలోనే గడిపి కనుమరోజు రాత్రి వెళ్లారు. ప్రస్తుతం లక్ష్మణరావు విజయవాడలో నివసిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం నెల్లూరుకు చెందిన రాజేశ్వరితో వివాహం కాగా కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె అర్నా ఇంటర్, కుమారుడు గురు నమన్ 9వ తరగతి చదువుతున్నారు.



సముద్రస్నానానికి వచ్చిన వారంతా కలిసి దిగిన ఫొటో (వృత్తాల్లో మృతులు)



మృతుడు మాధవ



జెస్సిక మృతదేహం



యామిని మృతదేహం



కందుకూరు ఆస్పత్రి వద్ద బంధువుల రోదనలు

శోకతీరం!

పాకల తీరం శోకసముద్రంగా మారింది. 'అల'కల్లోలం విషాదాన్ని నింపింది. సరదాగా సముద్ర స్నానాలు ఆచరించడానికి వెళ్లిన కుటుంబ సభ్యులను రాకాసి అలలు కాటేశాయి. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని బలితీసుకున్నాయి. మరొకరిని గల్లంతు చేశాయి. ఈ ప్రమాదంలో ఒకరిని మెరైన్ పోలీసులు కాపాడారు. గల్లంతైన యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాలను కందుకూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ బంధువుల రోదనలు మిన్నంటాయి. మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ పరిణామాలన్నీ గురువారం చోటుచేసుకున్నాయి.

- అలల తాకిడికి పాకల వద్ద విషాదం
- సముద్రంలో ఐదుగురు గల్లంతు
- వారిలో ముగ్గురు మృతి.. ఒకరి ఆచూకీ లేదు
- మరొకరిని కాపాడిన మెరైన్ పోలీసులు
- గాలింపు చర్యలను పర్యవేక్షించిన మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్
- ప్రత్యేక బోట్లతో సముద్రంలోకి పోలీసులు



గల్లంతైన వ్యక్తి కోసం గజ ఈతగాళ్ల గాలింపు చర్యలు

సింగరాయకొండ/కందుకూరు/పొన్నలూరు, జనవరి16 (ఆంధ్రజ్యోతి): పొన్నలూరు మండలం శివన్నపాలెం గ్రామానికి చెందిన నోసినా మాధవ కుటుంబసభ్యులు 25 మంది సింగరాయకొండ మండలంలోని పాకల తీరానికి సముద్ర స్నానాలు ఆచరించడానికి వచ్చారు. కుటుంబసభ్యులంతా కలిసి ఉల్లాసంగా మునుగుతు న్నారు. ఈ తరుణంలో ఒక్కసారిగా రాకాసి అల ఎగిసిపడటంతో ఆ ఉధృతికి మాధవ, అతని భార్య రమ్యతో పాటు మరో ఇరువురు గల్లంతయ్యారు. దీంతో వారి బంధువులు కేకలు వేయగా తీరంలో ఉన్న మెరైన్ పోలీసులు, మత్స్యకారులు వెంటనే రంగంలోకి దిగారు. అలల మధ్య కొట్టుమిట్టాడుతున్న నవ్యను కాపాడి బోటు సహాయంతో ఒడ్డుకు చేర్చారు. మిగతా ముగ్గురు శివన్నపాలెంకు చెందిన మాధవ (26), నోసినా జెస్సికా (16), కందుకూరు మండలం కొల్లగుంటకు చెందిన కొండాబత్తిన యామిని (19) ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను మెరైన్ పోలీసులు, మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు. అనంతరం మృతులను కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వివాహమైన ఆరు నెలలకే మృత్యువాత

శివన్నపాలెంకు చెందిన మాధవకి, కందుకూరు మండలం కొల్లగుంటకు చెందిన రమ్యతో ఆరు నెలల క్రితమే వివాహమైంది. పండుగ ముగిసిన తరువాత కుటుంబసభ్యులతో కలిసి సముద్ర స్నానాలు ఆచరించడానికి వచ్చారు. ఇంతలోనే ప్రమాదం చోటుచే సుకోవడంతో రమ్యతోపాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

స్నేహితులతో కలిసి వచ్చి అనంతలోకాలకు...

శివన్నపాలెంకు చెందినవారు గల్లంతైన సమయంలోనే సమీపంలో స్నేహితులతో కలిసి సముద్ర స్నానం చేస్తున్న సింగరాయకొండ శ్రీరామ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి పవన్(22) అలల ఉధృతికి లోపలికి కొట్టుకుపోయాడు. అతని కోసం మెరైన్ పోలీసులు, మత్స్యకారులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు.

రోదనలతో మిన్నంటిన కందుకూరు ఏరియా ఆస్పత్రి

కందుకూరు ఏరియా హాస్పిటల్‌లో మృతుల కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. సంక్రాంతి వేడుకల కోసం తమ మేనమామ, బావ ఇంటికెళ్లిన కందుకూరు రూరల్ మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన కొండాబత్తిన యామిని(14) మృతిచెందగా ఆ గ్రామస్థులు పెద్దఎత్తున ఏరియా హాస్పిటల్‌కు చేరుకున్నారు. మరోవైపు శివన్నపాలెం నుంచి మృతుల బంధువులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతదేహాలను చూసి కన్నీరు మున్నీరయ్యారు. అందరితో కలివిడిగా ఉండే యామిని మృతితో అనంతసాగరంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.



దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి స్వామి

సమాచారం అందుకున్న సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, ఎస్పీ ఏఆర్ దామోదర్ హుటాహుటిన పాకల తీరానికి చేరుకున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కందుకూరు ఏరియా ఆసుపత్రికి ఏస్పీ దామోదర్‌తో కలిసి వెళ్లారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

సముద్రస్నానాలకు వెళ్లి మృతిచెందిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అన్నివిధాలుగా అండదండలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆయన కందుకూరు ఏరియా హాస్పిటల్‌కు వచ్చి మృతదేహాలను సందర్శించి వారి కుటుంబసభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎస్పీ దామోదర్, కందుకూరు సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ, కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, జిల్లా డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



తెల్లబాడు జడ్పీ ఉన్నత పాఠశాల

కబ్జాకోరల్లో ఆట స్థలం

హైస్కూల్ క్రీడా మైదానాన్ని ఆక్రమించిన వైసీపీ నేత

పంటల సాగు.. పట్టించుకోని అధికారులు

వైసీపీ నేతలు ఇన్నాళ్లూ వాగు భూములను ఆక్రమించుకున్నారు. అసైన్డ్ భూములను కబ్జా చేశారు. చెరువు భూములనూ వదల్లేదు. ఇప్పుడు విద్యార్థులు ఆటలు ఆడుకునే పాఠశాల క్రీడా మైదానాలనూ వదడం లేదు. భూములకు రెక్కలు రావటంతో వారి అక్రమాలకు, ఆక్రమణలకు అడ్డేలేకుండా పోయింది. భూమి ఖాళీగా కనిపిస్తే చాలు దర్జాగా ఆక్రమించుకొని సాగు చేసుకోవటం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో దొనకొండ మండలంలోని తెల్లబాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదు ఎకరాల ఆట స్థలం భూమిని ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్న వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

దొనకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెల్లబాడులో 1982లో పొదిలి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటుచేశారు. 1985లో విద్యార్థులు ఆడుకునేందుకు 178/2 సర్వేనెంబర్‌లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. అప్పట్లో పాఠశాలలో విద్యార్థులకు సరిపడా స్థలం ఉండటంతో అక్కడే ఆటలాడుకునేవారు. పాఠశాల క్రమేపీ అభివృద్ధి చెందుతూ ఉన్నత పాఠశాలగా పురోగతి చెంది అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. పరిసరాల్లో మొక్కలు నాటడం తదితర కార్యక్రమా లు ముమ్మరంగా జరగటంతో ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు సరిపడ ఆటస్థలం లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉన్నతాధికారులు పాఠశాలకు ఆట స్థలం నిమిత్తం సర్వేనెంబర్ 178/2లో కేటాయించిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పట్లో విద్యాశాఖ అధికారులు సర్వే చేయించుకొని పాఠశాల అవసరాలకు వినియోగించుకునేలా దృష్టి సారించ కుండా వదిలేశారు. దీంతో గ్రామంలో వైసీపీకి చెందిన కుటుంబం ఆ భూమిని ఆక్రమించుకొని ఏళ్ల తరబడి సాగుచేసుకుంటోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు ప్రధానోపాధ్యాయులు ఆట స్థలానికి కేటాయించిన సర్వేనెంబర్ 178/2లోని ఐదు ఎకరాల భూమిని సర్వే చేసి చూపాలని రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ఈ విషయమై గ్రామస్థులు ఇటీవల తహసీల్దార్, దర్శి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. డీఎస్పీ ఆదేశాల మేరకు త్రిపురాంతకం సీఐ హస్సాన్ గ్రామానికి విచ్చేసి స్థానికులతో చర్చించి వెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై తగిన చర్యలు చేపట్టి విద్యార్థులకు ఆట స్థలాన్ని కేటాయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యార్థులకు ఆట స్థలం లేక ఇబ్బందులు

ప్రస్తుతం పాఠశాలకు చెందిన విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు, తర్ఫీదు ఇచ్చేందుకు పాఠశాలలో సరిపడా ఆట స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రికార్డుల ఆధారంగా క్రీడా స్థలానికి ఎంపిక చేసిన భూమిని సర్వే నిమిత్తం అధికారులకు దరఖాస్తు చేసేందుకు సిద్ధమవుతున్నాం.

- సీతమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, జడ్పీ ఉన్నత పాఠశాల, తెల్లబాడు



విచారించి తగిన చర్యలు చేపడతాం

తెల్లబాడు జడ్పీ పాఠశాలకు చెందిన ఐదు ఎకరాల ఆట స్థలం భూమిని ఆక్రమించి సాగు చేస్తున్నారని కొందరు గ్రామస్థులు రెవెన్యూ సదస్సులు జరుగుతున్న సమయంలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి తగిన చర్యలు చేపడతాం.

- బి.రమాదేవి, తహసీల్దార్, దొనకొండ





పాఠశాలకు కేటాయించిన ఆట స్థలంలో ఆక్రమణదారుడు సాగు చేసిన కంది



శ్రీను మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి

- ట్రాక్టర్‌పై నుంచి పడి ఇద్దరు కూలీలు మృతి
- ముగ్గురికి తీవ్ర గాయాలు
- భూపతిపల్లెలో తీవ్ర విషాదం
- కలగోట్ల వద్ద ఘటన

చిన్నపాటి నిర్లక్ష్యం రెండు ప్రాణాలను బలి తీసింది. మరో ముగ్గురికి తీవ్ర గాయాలపాలు చేసింది. ట్రాక్టర్‌లో కూలీలను తరలించే క్రమంలో ట్రక్కు వెనుక వైపు డోరుకు కట్టిన తాళ్లు తెగడంతో ప్రమాదం జరిగి ఇద్దరు కూలీలు మృతిచెందారు. బేస్తవారపేట మండలంలోని కలగోట్ల వద్ద గురువారం ఈ దారుణం చోటుచేసుకొంది.

బేస్తవారపేట, జనవరి16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మండలం భూపతిపల్లె గ్రామానికి చెందిన కూలీలు నిత్యం బేస్తవారపేట మండలంలోని పలుగ్రామాలకు ట్రాక్టర్‌పై పచ్చాకు కోతకు వస్తుంటారు. రోజులాగా గురువారం తెల్లవారుజామున పలువురు కూలీలు ట్రాక్టర్‌పై మండలంలోని మల్లాపురం గ్రామానికి బయలుదేరారు. ట్రాక్టర్‌లో ఇంచుమించు 23 మంది కూలీలు ఉన్నారు. మరో పదినిమిషాల్లో గమ్యస్థానం మల్లాపురం చేరుకోవాల్సి ఉంది. అయితే ట్రాక్టర్ ట్రాలీలో వెనుక డోర్‌పై ఐదుగురు కూలీలు కూర్చున్నారు. వీరు కూర్చున్న వెనుక డోరుకు సపోర్టుగా తాడు కట్టి ఉంది. ఆ తాడు కలగోట్ల గ్రామ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద ఒక్కసారిగా తెగింది. దీంతో డోర్‌పై కూర్చున్న ఐదుగురు కిందపడ్డారు. క్షతగాత్రులను వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో మొండెం కాశయ్య(58), మల్లాపురం శ్రీను(47) అప్పటికే మృతిచెందారు. మరో ముగ్గురు మెండెం నాగేశ్వరావు, మల్లాపురం బాలయ్య, మల్లాపురం సుబ్బయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం, ఒంగోలు తరలించారు. మృతిచెందిన కాశయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనుకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. బేస్తవారపేట ఏస్సై రవీంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాశయ్య మృతదేహం



ప్రమాదానికి కారణమైన ట్రక్కు

ఆనందంగా గడుపుతూ..
అంతలోనే అనంత లోకాలకు..

● పాకల తీరంలో ముగ్గురు మృత్యువాత

సింగరాయకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. సంక్రాంతి పండుగ ముగియడంతో ఆనందంగా గడపడానికి దాదాపు 25 మందికి పైగా కలిసి పాకల తీరానికి వచ్చారు. చిన్నాపెద్ద అంతా కలిసి సంతోషంగా కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు ఆచరిస్తున్నారు. మధుర జ్ఞాపకంగా ఉంచుకోవడానికి మధ్యలో కుటుంబసభ్యులు అందరూ కలిసి తీరాన గ్రూపు ఫొటో దిగారు. అనంతరం మరోమారు అందరూ కలిసి సముద్రంలో దిగగా అంతలోనే విధి చిన్నచూపు చూసింది. వారిలో నలుగురిని మృత్యు అలలు అమాంతం లాగేసుకున్నాయి. వారిలో ముగ్గురు మృతి చెందగా ఒకరిని మెరైన్ పోలీసులు, మత్స్యకారులు రక్షించారు. ఆనందంగా గడపడానికి వచ్చి కళ్లముందే తమవాళ్లు ముగ్గురు అనంత లోకాలకు వెళ్లడంతో వారి కుటుంబ సభ్యుల ందనలు మిన్నంటుతున్నాయి.

స్నేహితులతో కలిసి వెళ్లి..

సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి పవన్ తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లో అమెజాన్‌లో డెలవరీ బాయ్‌గా పనిచేస్తుంటాడు. ఈ ఉద్యోగంలో కూడా నెల రోజులు క్రితమే చేరాడు. తొలి నెల జీతం తీసుకొని సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామానికి వచ్చారు. శుక్రవారం తిరిగి వెళ్లడానికి బస్సు టికెట్ కూడా రిజర్వ్ చేస్తుకున్నాడు. ఈ తరుణంలో గురువారం తన స్నేహితులు రవితేజ, రాజేష్‌తో కలిసి సరదగా గడపడానికి పాకల తీరానికి వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి ఉల్లాసంగా మునుగుతుండగా అలల ఉధృతికి సముద్రంలో గల్లంతయ్యాడు. అతని మృతదేహం బయటకు రాకపోవడంతో మంత్రి స్వామి, ఎస్పీ దామోదర్ ఆదేశాలతో స్థానిక పోలీసులు, మెరైన పోలీసులు, మత్స్యకారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. పవన్ తల్లిదండ్రులు గతంలో హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ కుమార్తెను, కుమారుడును అక్కడే చదివించారు. మూడేళ్ల కితం స్వగ్రామానికి వచ్చి బేల్దారి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ సమయంలో చేతికి అంది వచ్చిన కుమారుడు మృతిచెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పర్యాటకులు
పోలీసుల సూచనలు పాటించాలి : ఎస్పీ



తీరంలో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్, మంత్రి స్వామి


సింగరాయకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సముద్ర తీరానికి వచ్చిన పర్యాటకులు పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ సూచించారు. పాకల తీరంలో అలల ఉధృతికి ముగ్గురు మృతి చెందారని, మరో యువకుడు గల్లంతయ్యాడని సమాచారం అందుకున్న ఆయన హుటాహుటిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి గురువారం సాయంత్రం పాకల తీరానికి వచ్చారు. అక్కడ ఉన్న పోలీసులను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులతో మట్లాడారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. స్థానిక జాలర్లతో మాట్లాడి గల్లంతైన తమ్మిశెట్టి పవన్ కోసం బోట్లలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. స్వయంగా కాసేపు పర్యవేక్షించారు. అనంతరం స్వామితో కలిసి కందుకూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ప్రియురాలి వేధింపులకు
యువకుడు బలవన్మరణం

● యువతి, ఆమె తండ్రి, స్నేహితురాలిపై అట్రాసిటీ కేసు

నాగులుప్పలపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేయడంతోపాటు బెదిరింపులకు పాల్పడటంతో మనస్థాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు యువతి, ఆమె తండ్రి, ఆమె స్నేహితురాలిపై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. బాధితుడి తండ్రి, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉప్పుగుండూరు గ్రామంలోని అంబేడ్కర్‌కాలనీకి చెందిన కందుల దానియేలు రెండవ కుమారుడు ప్రవీణ్(28)కు ఒంగోలు గోపాలనగరానికి చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. పైచదువుల కోసం ఆ యువతి విదేశాలకు వెళ్లింది. అప్పటి నుంచి తన చదువులకు కావాల్సిన డబ్బులు పంపించాలని, లేకుంటే నీతో స్నేహం చేయనని ఫోన్‌లో నిత్యం తీవ్ర ఒత్తిడి చేస్తోంది. అదేమిటని అడిగిన ప్రవీణ్‌ను ఆమె తండ్రి తిరుమలరావు, ఆమె స్నేహితురాలు పలుమార్లు బెదిరించి, కులం పేరుతో దూషించారు. దాంతో పాటు సోషల్ మీడియాలో ప్రవీణ్ కుటుంబసభ్యులను బజారుకీడుస్తామని బెదిరించారు. ఓ వైపు ప్రేమ విఫలమవడం మరోవైపు బెదిరింపులతో మనస్థాపానికి గురైన ప్రవీణ్ బుధవారం ఇంట్లో ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. అందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని యువకుడి తండ్రి దానియేలు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై ఎన్‌జీపాడు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో సుందరీకరణలో భాగంగా పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం తెల్లవారుజామున నగరంలోని మస్టర్ పాయింట్‌లను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు 5 గంటలకే విధుల్లోకి రావాలని తెలిపారు. అలాగే పనుల్లో నిర్లక్ష్యం వహించినా, అశ్రద్ధ చూపినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందకూడదన్నారు. ఇన్‌స్పెక్టర్, శానిటరీ సెక్రటరీలు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. అనంతరం అన్న క్యాంటీన్లను తనిఖీ చేశారు. అందరికీ నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ షేక్ బాబ్జి, పలువురు శానిటరీ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పూర్వ విద్యార్థులు

కొండపి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన 1996-98 బ్యాచ్ విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత శుక్రవారం కొండపిలో కలుసుకున్నారు. వివిధ వృత్తి ఉద్యోగాల్లో ఉన్న వీరంతా ఆప్యాయంగా పలకరించుకున్నారు. కుటుంబ యోగక్షేమాలు, పూర్వ విద్యార్థుల సాన్నిహిత్యంతోపాటు, నాటి గురువులను గుర్తు చేసుకున్నారు. ఏడాదికోసారి కలుసుకోవాలని వారు నిర్ణయించుకున్నారు.

చీమకుర్తి మండల అభివృద్ధికి మార్గం సుగమం

50-40-10 దామాషాలో రూ.20కోట్ల మండల నిధుల వినియోగం ● ఇరువురి అధినేతల మధ్య కుదిరిన అవగాహన

పనుల గుర్తింపుపై ఇరు పార్టీల నాయకుల కసరత్తు షురూ.. ● త్వరలో పనులకు ఆమోద ముద్ర

చీమకుర్తి, జనవరి16(ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండల పరిషత్ నిధుల వినియోగంలో నెలకొన్న ప్రతిష్టంభన, మడతపేచీలకు ఎట్టకేలకు పరిష్కారం దొరకనుంది. పంతాలు, పట్టింపులు, పార్టీలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు మండల అభివృద్ధి కోసం ఇరు పార్టీలకు చెందిన అధినేతల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మండల నిధుల వినియోగంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారమార్గంగా మారింది. మండలంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి, అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారుల నిర్మాణం, శ్మశానాల అభివృద్ధి, అలాగే సీసీ, బీటీ రహదారులు, సైడ్‌కాలువల నిర్మాణం తదితర పనులను దాదాపు రూ.20కోట్లకు పైగా ఉన్న మండల నిధులతో చేపట్టనున్నారు. కాగా ఈ నిధుల వినియోగంలో ఆరునెలల నుంచి నెలకొన్న మడతపేచి ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిల చొరవతో మార్గం దొరికింది. గతనెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఇరుపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు నిధుల వినియోగంలో నెలకొన్న ప్రతిష్టంభనపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నిధులున్నా పనులు ఏమీ చేయలేకపోతున్నారని గ్రామాల్లో ప్రజలు ప్రశ్నించటంపై చర్చించారు. ఈ మేరకు ఇరుపార్టీల ప్రజాప్రతినిధులు వారి అధినేతలకు ఈ సమస్యను వివరించి పరిష్కారించాలని విన్నవించుకున్నారు. మండల పరిషత్ వైసీపీ చేతిలో ఉండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో నిధులు వినియోగించాలంటే మండల పాలకవర్గం నుంచి పనులకు ఆమోదం, తర్వాత టెక్నికల్ అనుమతులకు ప్రభుత్వం అనుమతి తప్పనిసరైంది. రెండుచేతులు కలిస్తేనే చప్పట్లు మోగే పరిస్థితి ఏర్పడింది. మండలంలో నిధులున్నాయనే పల్లె పండగకు ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో చీమకుర్తి మండలాన్ని మినహాయించి మిగతా మూడు మండలాలకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నిధులు కేటాయించారు. గత రెండునెలలుగా ఆ మూడు మండలాల్లో అభివృద్ధి పనులు చకచకా జరగటం, చీమకుర్తి మండలంలో పల్లెపండగ కనపడని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మండల నిధుల వినియోగంపై నెలకొన్న ప్రతిష్టంభన పరిష్కరించాలని బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఫోన్‌లో బీఎన్.విజయ్‌కుమార్‌ను కోరారు. మండల అభివృద్ధి కోసం ఇరువురి మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలుస్తుంది. మండలంలో ఉన్న నిధులలో 50శాతం టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మరో 40శాతం వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పనులు నిర్వహిస్తారు. మిగిలిన 10శాతం నిధులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచించిన మేరకు అత్యవసర పనులకు వినియోగించే నిమిత్తం కేటాయించారు. ఈ అవగాహన మేరకు గ్రామాలకు ఎంతెంత నిధులు కేటాయించాలి, ఎలాంటి పనులు నిర్వహించాలనే విషయంపై అధికారులు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఖరారు చేసుకోవాల్సింది. ఈ పని పూర్తయితే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఖరారైన మేరకు పనుల నిర్వహణకు సభ్యుల ఆమోదం పొందనున్నారు. ఈ మేరకు మండలంలోని 24 పంచాయతీలలో ఉన్న ఇరుపార్టీలకు చెందిన సర్పంచ్, ఎంపీటీసీలు, గ్రామ ముఖ్యనాయకులు మండల నాయకులతో కలిసి పనుల జాబితాను తయారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తున్నది. పనుల గుర్తింపు, గ్రామాల వారి కేటాయింపులు, ఒప్పందం మేరకు పనుల పంపకాల విషయంలో నెలకొనే చిన్నచిన్న అవరోధాలను అధిగమించకలిగితే మండల అభివృద్ధి సాకారం అవుతుంది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలకు కొంత మేర అయినా పరిష్కారం లభిస్తుంది.



చీమకుర్తి మండల కార్యాలయం

'బంగారు బాల్యం'పై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ తమీమ్‌అన్సారియా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారందరినీ పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గురువారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా జిల్లా రిసోర్స్ సెంటర్(డీఆర్‌సీ)ను ఏర్పాటు చేసి ప్రతి శాఖ నుంచి ఒకరిని ఈ సెంటర్‌లో డిప్యుటేషన్‌పై నియమించాలన్నారు. తద్వారా బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో కానీ, వయస్సును బట్టి స్కిల్‌డెవలప్‌మెంట్‌లో చేర్పి వారిని సమాజంలో భాగస్వాములను చేసి మంచి గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. జిల్లా రిసోర్స్‌సెంటర్‌లోని ఉద్యోగులకు శిక్షణలు ఏర్పాటు చేసి ఏ శాఖ ఉద్యోగులు ఏ కార్యక్రమం చేయాలో వివరించాలన్నారు. జిల్లాలో బాలకార్మికులు, బాల్యవివాహాలు, బాలలపై ఎటువంటి అఘాయిత్యాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పలు శాఖల అధికారులు హెనసుజన్, చిరంజీవి, డాక్టర్ వెంకటేశ్వర్లు, లక్ష్మానాయక్, దినేష్‌కుమార్, సార్డ్ ప్రతినిధి సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్

ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్(స్పెషల్ డిప్యూటీ కలెక్టర్)గా ఎస్.జాన్సన్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు మొక్కను అందజేశారు.

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే విజయ్‌కుమార్



బాధితుడి ఇంటి వద్ద చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎంతైనా ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రమాదంలో గాయపడి కోలుకున్న వ్యక్తి ఇంటికే వెళ్లి సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు ఎమ్మెల్యే బీఎన్. పేర్నమిట్ట 41వడి విజన్ నాయకుడు వివరం గోవిందు కుమారుడు వెంకటసాయి కొన్నాళ్ల క్రితం ఓ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం కోలుకున్నాక శుక్రవారం వెంకటసాయి ఇంటికే ఎమ్మెల్యే విజయ్‌కుమార్ స్వయంగా వెళ్లి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.8,88,797ల చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి బాబు, ఎన్.రాఘవరావు, డి.హనుమంతరావు, ఎం.పోలయ్య, కె.శ్రీను, డి.కోటేశ్వరరావు, అనిల్, బ్రహ్మయ్య, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో తెలియదా..?

● మాజీ ఎంపీ చింతా మోహన్ ఫైర్



మాట్లాడుతున్న చింతా మోహన్

ఒంగోలు క్రైం, జనవరి16 (ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం ఎప్పుడు వచ్చిందో కూడా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌కు తెలియదా అని తిరుపతి మాజీ ఎంపీ చింతామోహన్ మండిపడ్డారు. గురువారం ఒంగోలులోని ఎంసీఏభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మోహన్‌భగవత్ అయోధ్యలో రామాలయం కట్టిన తరువాత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన మాటలపై సుప్రీంకోర్టు స్పందించాలని కోరారు. అదేవిధంగా ఎస్సీలను విభజించి తమ పబ్బం గడుపుకునేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వర్గీకరణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రంలో మాత్రమే ఏక సభ్య కమిషన్ వేశారని, దీనిని తాను వ్యతిరేకిస్తునట్లు ప్రకటించారు. ఏకసభ్య కమిషన్ మిశ్రాకు అంటరానితనం అంటే ఏమిటో తెలిసా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్యాక్టరీపై ప్రభుత్వాల వైఖరి స్పష్టం చేయాలన్నారు. ఈనెల 8న విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఊసే ఎత్తలేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశ్, నాయకులు విజేంద్ర బహుజన్, మన్నం ప్రసన్నరాజు, శ్రీపతి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు విద్య, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు మాట్లాడుతూ డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, హైస్కూలు ప్లస్‌లో పనిచేస్తున్న అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఆళ్ల రమేష్, ప్రధానకార్యదర్శి నాగరాణి, జి.మధు, ఎం.కోటేశ్వరరావు, పి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఒమ్మెవరం టీడీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు: ఒమ్మెవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఒంగోలులోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ గుమ్మడి సాయిబాబా, గ్రామ అధ్యక్షుడు కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ పాలపర్తి బాలకోటి, మాజీ సర్పంచ్ పిన్నక వెంకటసుబ్బారావు, సాయిప్రసాద్, పోతినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ పింఛన్లు పొందుతున్న వారికి వైద్యపరీక్షలు

చీమకుర్తి, జనవరి16 (ఆంధ్ర జ్యోతి) : చీమకుర్తి మండలపరిధిలో వైద్యపరమైన కారణాలతో పింఛన్ పొందుతున్న వారిలో ఎవరైనా అక్రమంగా లబ్ధి పొందుతున్నారా లేక సక్రమమేనా అని నిర్ధారించటానికి గురువారం వైద్యపరీక్షలు జరిపారు. మండలంలోని పలుగ్రామాల్లో ఉన్న 20మంది పింఛన్‌దారులకు ప్రత్యేక వైద్య బృందంతో పలు వైద్య పరీక్షలు జరిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాఘవేంద్ర, డాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

వరినాట్లతో రైతుల బిజీ



మల్లవరంలో నాటు వేస్తున్న కూలీలు

మద్దిపాడు, జనవరి16(ఆంధ్రజ్యోతి): వరి నాట్లతో రైతులు బిజీగా ఉన్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ సమీపంలో మల్లవరం వద్ద రైతులు వరి సాగు చేపట్టారు. పొలం పనులు ముమ్మరం కావడంతో కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. డిమాండ్‌ను బట్టి కూలి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు పొగాకు దెబ్బతిని పోవడంతో మళ్లీ పొగనాట్లు వేస్తున్నారు.

ఇంటర్న్‌షిప్ కోసం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ కార్యక్రమానికి ఈనెల 21వతేదీలోపు రిజిస్ట్రేషన్ (పేర్లు నమోదు) చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. తద్వారా యువతకు అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. దేశంలోని అర్హత కలిగిన కంపెనీలలో 12 నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.4500 వేతనంతో పాటు రూ.500 శిక్షణ భత్యం ఇస్తారన్నారు. వివరాల కోసం 9988853335 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

రేపు నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు విద్య, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి విద్యార్థులను ఎంపిక చేసేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్షకు 5,484 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. తమ హాల్‌టిక్కెట్‌తో పాటు ఆధార్ జెరాక్స్ కాపీతో పరీక్షకు హాజరుకావాలన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్‌తో సమాధానాలు గుర్తించాలని సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కందుకూరు బాలుర, బాలికలు, సింగరాయకొండ బాలికల, వీవీపాలెం, మార్టూరు జడ్పీ హైస్కూలు, ఒంగోలు బండ్లమిట్టబాలికోన్నత, అద్దంకి బాలుర, బాలికలు, మద్దిపాడు, కొండపి, టంగుటూరు, సింగరాయకొండ, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కొండపి, మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒంగోలు పీవీఆర్ బాలికలు, రామనగర్, డీఆర్ఆర్ఎం మునిసిపల్ స్కూలు, పర్చూరు వైఆర్, నాగులపాలెం, చీరాల ఎస్ఆర్అండ్‌పిఎం, కేజీఎం హైస్కూలు, వలేటివారిపాలెం ఏపీ మోడల్ స్కూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన గీతాలక్ష్మి తెలిపారు.

అదుపు తప్పి ఢీకొన్న కార్లు



ఘటనా స్థలంలో ఉన్న కార్లు

నాగులుప్పలపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అదుపు కారు ముందు వెళుతున్న కారును ఢీకొనగా ఆ వాహనాన్ని వెనక ఉన్న మూడుకార్లు ఢీకొన్న సంఘటన నాగులుప్పలపాడులోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం నాగులుప్పలపాడు బస్టాండ్ జంక్షన్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఒంగోలు వైపు వెళుతున్న వాహనాలు ఎడమ వైపు వరుస క్రమంలో వెళుతున్నాయి. ఈ క్రమంలో ముందు వెళుతున్న కారును వెనక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొంది. దీంతో దానికి వెనక ఉన్న మూడో కార్లు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా కార్ల ముందు, వెనక బాగాలు దెబ్బతిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

టంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుతీర గ్రామాలైన అనంతవరం, ఆలకూరపాడు, రావివారిపాలెం, పసుకుదురు, కేసుపాలెం గ్రామాల్లో గురువారం విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 42 మంది విద్యుత్, పోలీస్ అధికారులు 90 మంది సిబ్బందితో 42 బృందాలుగా విడివడి 2,260 సర్వీసులు పరిశీలించారు. వాటిలో అదనంగా విద్యుత్ వినియోగిస్తున్న 161 మందికి రూ7.79 లక్షలు అపరాధ రుసుం విధించిన్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.హరిబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో సూపరిండెంట్ ఇంజనీర్ విజిలెన్స్ ఆల్వాన్సా, ఏఈ విజిలెన్స్ టి.హైమావతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తోట శ్రీకాంత్, పి.రంగారావు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

టంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం టంగుటూరు మసీదు సెంటర్‌లో ఎన్టీఆర్ వర్ధంతిని 17, 18 తేదీల్లో టంగుటూరు ఎన్టీఆర్ సేవా సమతి ఆధ్వర్యాన నిర్వహించనున్నట్లు సేవా సమితి ప్రతినిధి రావూరి తిరుమల రాధాక్రిష్ణ గురువారం తెలిపారు. 17న టంగుటూరులో బాలబాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తామని, 18న ఉదయం నుంచి ముగ్గుల పోటీలు కొనసాగుతాయన్నారు. అదేరోజు సాయంత్రం ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

టంగుటూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): టంగుటూరులో రాములవారి తెప్పోత్సవం వైభవంగా బుధవారం రాత్రి ముగిసింది. ప్రముఖ పారిశ్రామిక వేత్తలు బెల్లం కోటయ్య, బెల్లం జయంత్‌బాబు, రాజకీయ ప్రముఖులు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కామని విజయకుమార్, హాజరై రథం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని ముందుకు కదలించారు. మూడు రోజులు కొనసాగిన సంక్రాంతి సంబరాల్లో విజేతలను వేదికపైకి పిలిచి బహుమతులు ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ హాకీ పోటీలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ వనజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఇన్‌చార్జ్ హెచ్ఎం ఓబుల్, హాకీ మైనంపాడు అధ్యక్షుడు జి.కాలేషా, పీఈటీ రవికుమార్‌లు అభినందించినట్లు ఆమె తెలియజేశారు.

ట్రాఫిక్ సమస్యపై శ్రద్ధ పెట్టాలి : సీఐ



మాట్లాడుతున్న సీఐ సోమశేఖర్

కొండపి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కొండపిలో ట్రాఫిక్ సమస్యపై శ్రద్ధ పెట్టాలని సీఐ జి.సోమశేఖర్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. గురు వారం మధ్యాహ్నం ఆయన కొండపిలోని పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన విచారించాలని ఈ సందర్భంగా ఎస్సై ప్రేమ్‌కుమార్‌ను ఆదేశించారు. సోషల్ మీడియా కేసులు, సమాజంలో జరిగే నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు, చిన్నపిల్లల మీద జరుగుతున్న నేరాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని ఆదేశించారు.

మాలల అణచివేత కుట్రను తిప్పికొట్టండి



మాట్లాడుతున్న వెంకట్రావు

సంతనూతల పాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాలల అణచివేత కుట్రలను తిప్పికొట్టాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లె వెంకట్రావు పేర్కొన్నారు. గురువారం పేర్నమిట్ట అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద వర్గాల, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న మాలలను అణచివేయాలని కుట్రలు చేయాలని చేస్తున్నారని, దీనిని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఫిబ్రవరి 15న చీమకుర్తిలో జరిగే మాలల కళల జాతరను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీ.రత్నాకర్, సీహెచ్.వెంగళరావు, ఎన్.శరత్, శేషయ్య, సుబ్బారావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చల్ చల్ చెక్క రిక్షా



అప్పట్లో దొరలు.. దొరసానులు కూడా ఎక్కేవారు

ఐటీసీ, ఐఎల్‌టీడీ కంపెనీలకు పనులపై వచ్చే తెల్లదొరలు, దొరసానులు మా చెక్క రిక్షాల పైన సవారీ చేసేందుకు ఆసక్తిగా వచ్చేవారు. సవారీకి కిరాయి కూడా ఎక్కువగా ఇచ్చేవారు. అదంతా ఒకప్పటి మాట. ఆ సంఘటనలు గుర్తుకొచ్చినపుడు మాకే ఆశ్చర్యంగా ఉంటుందని అప్పుడు, ఇప్పుడు రిక్షా పుల్లర్లుగా జీవితం సాగిస్తున్న వారు చెప్తున్నారు.

ఇది చీరాల స్పెషల్

రోజురోజుకూ మసకబారుతున్న రిక్షా వైభోగం

ఆటోలతో తగ్గుతున్న బాడుగలు

వాటితో జీవనం సాగిస్తున్న వారు 50ఏళ్ల పైబడిన వారే

చీరాల, జనవరి 16 : చినముంబయిగా పేరు పొందిన చీరాల చెక్క రిక్షాలకు ప్రసిద్ధి. రెండున్నర దశాబ్దాల కిందట చీరాలలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు చెక్క రిక్షాలే సాధనాలు. అప్పట్లో ప్రతి కూడలిలో కనీసం 15 నుంచి 20 వరకు చెక్క రిక్షాలు ఉండేవి. వాటిపై సవారీ చేసేందుకు ప్రజలు కూడా ఆసక్తి చూపేవారు. రిక్షా పుల్లర్లకు రోజువారీ బాడుగ బాగానే గిట్టుబాటయ్యేది. కాలచక్రం తిరుగుతున్న క్రమంలో చెక్క రిక్షాల వైభవం మసక బారుతోంది. వాటి స్థానంలో ఆటోలు వచ్చాయి. ఆటోలకు పోటీగా రిక్షా ప్రయాణం జరగదు. దీంతో ప్రయాణికులు కూడా చెక్క రిక్షాలపై గతంలో మాదిరిగా మక్కువ చూపటం లేదు.

● గతం ఘనం.. వర్తమానం శూన్యం

సుమారు రెండున్నర దశాబ్దాల కిందట చీరాల మున్సిపాలిటీ, చీరాల, వేటపాలెం మండలాల పరిధిలో సుమారు 300 చెక్క రిక్షాలు ఉండేవి. వాటికి యూనియన్లు కూడా ఉండేవి. సంఘటితంగా ఉండేవారు. ఇతర ప్రాంతాల్లో గూడు రిక్షాలు ఉండేవి. ఒక్క చీరాలలోనే చెక్క రిక్షా సవారీ ఉండేది. చీరాలకు ఐఎల్‌టీడీ కంపెనీ ఉపాధి వనరు. ఆ కంపెనీకి పనిమీద వచ్చే వారు కూడా చెక్క రిక్షా ఎక్కేందుకు ఆసక్తి చూపేవారు. తమ సరదా తీర్చుకునేవారు. అలాంటి గతం ఘనం. గత కొన్నేళ్లుగా క్రమేణా చెక్క రిక్షాల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఆటోలు అందుకు కారణం. ప్రయాణికులు కూడా చెక్క రిక్షా కన్నా వేగంగా గమ్యం చేరేందుకు ఆటోలను ఆదరించడం మొదలుపెట్టారు. దీంతో క్రమేణా చెక్క రిక్షాల సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. ఇది మసక బారుతున్న వర్తమానం.

ఒకప్పుడు ప్రయాణానికి రాజసంగా చెక్క రిక్షాలు నిలిచాయి. రూపాయో.. అర్ధ రూపాయో ఇచ్చి వీధుల్లో దర్జా ఒలకబోస్తూ కొందరు ప్రయాణించేవారు. గొందుల్లో, సందుల్లో, జనం మధ్యలో నుంచో రివ్వుమంటూ చెక్క రిక్షాలు దూసుకెళ్లేవి. ఎంతో మందిని గమ్యస్థానాలకు చేరవేసేవి. అంతేగాక వీటి మీద ఆధారపడి ఎంతో బతుకుబండిని వెళ్లదీసేవారు. రానురాను ఆటోలు వచ్చాక వాటి ప్రాభవం కోల్పోతున్నాయి. వాటి వేగాన్ని చెక్క రిక్షాలు అందుకోలేకపోతున్నాయి. దీంతో వాటికి ఆదరణ క్రమక్రమంగా తగ్గిపోతోంది.



ఆటోలు నడపలేం.. రిక్షాలు వదులుకోలేం...

ప్రస్తుతం సుమారు 50 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే చెక్క రిక్షాలతో ఇప్పటికీ జీవనం సాగిస్తున్నారు. ఆలోపు వారు ఆటో నడపడం నేర్చుకుని కొందరు ఆటోను బాడుగ(అద్దె)కు తీసుకుని తిప్పుకుంటున్నారు. కొందరు సొంతంగా ఆటోలు కొంటున్నారు. కాలంతో పరిగెత్తలేకపోయినా, కాటికి కాళ్లుచాచి ఊరకనే కూర్చోలేం కదయ్యా. అందుకే మా తరం వరకు ఈ రిక్షాలు ఉంటాయి. ఆ తరువాత ఈ చెక్క రిక్షా తొక్కేవారు.. సవారీ చేసేవారు ఎవరూ ఉండరు.

ఆ ముగ్గురూ నాటి అద్దంకి ఎస్ఐలే

ప్రస్తుత చీరాల డీఎస్పీగా ఒకరు, అద్దంకి రూరల్ సీఐగా మరొకరు,

టౌన్ సీఐగా ఇంకొకరు విధులు



మొయిన్, చీరాల డీఎస్పీ



మల్లికార్జునరావు, అద్దంకి రూరల్ సీఐ



సుబ్బరాజు, అద్దంకిటౌన్ సీఐ

అద్దంకి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గతంలో అద్దంకి ఎస్సైలుగా పనిచేసిన ముగ్గురు ప్రమోషన్‌లు పొంది ప్రస్తుతం చీరాల డీఎస్పీగా, అద్దంకిరూరల్, టౌన్ సీఐలుగా పనిచేయడం యాధృశ్చికంగా ఒకేసారి జరిగింది. 2007 నుంచి 2010 వరకు మూడు సంవత్సరాల పాటు అద్దంకి ఎస్ఐగా పనిచేసిన మహ్మద్ మొయిన్ సీఐగా ప్రమోషన్‌పై నెల్లూరు జిల్లా కలిగిరి వెళ్లారు. అనంతరం పలు చోట్ల సీఐలుగా పనిచేసి డీఎస్పీగా ప్రమోషన్ పొందారు. ప్రస్తుతం చీరాల డీఎస్పీగా పనిచేస్తున్నారు. అద్దంకి ఎస్ఐగా 2010 ఆగస్టు నుంచి 2011 డిసెంబరు వరకు పనిచేసి ప్రమోషన్‌పై సీఐగా సీఐడీ విభాగానికి వెళ్లారు. వివిధ సర్కిళ్లలో పనిచేసి ప్రస్తుతం మేదరమెట్ల కేంద్రంగా ఉన్న అద్దంకి రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం అద్దంకి టౌన్ సీఐగా విధులలో చేరిన సుబ్బరాజు 2017 మే నుంచి 2019మే వరకు రెండు సంవత్సరాల పాటు అద్దంకి ఎస్సైగా విధులు నిర్వహించారు. అనంతరం వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేసి సీఐగా ప్రమోషన్ పొంది నెల్లూరు జిల్లాలో పనిచేసి ప్రసుత్తం అద్దంకి టౌన్ సీఐగా వచ్చారు. ముగ్గురు అధికారులు అద్దంకిలో ఎస్సైలుగా ఎక్కువ కాలం పనిచేసిన అధికారులు కావడంతో అద్దంకిపై పూర్తి అవగాహన ఉంది. మంచి పోలీసింగ్ చేసేందుకు ఎంతగానో దోహదపడుతుందని ప్రజలు భావిస్తున్నారు.

చందలూరులో ఆధ్యాత్మిక శోభ

వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి కొలుపు

వేలాదిగా పాల్గొన్న భక్తులు,

నేడు పాలవెల్లి మహోత్సవం

పంగులూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : చందలూరు ప్రజలు శతాబ్దాలుగా కొలుస్తూ తమ ఆరాధ్య దైవంగా, ఇంటి ఇలవేల్పుగా భావించే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవం అత్యంత వైభవంగా కొనసాగుతోంది. గురువారం అమ్మవారికి గొట్టిపాటి, కసుకుర్తి వంశస్తులు మోయనం సమర్పించారు. అమ్మవారికి వేద పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం గ్రామంలో జరిగిన అమ్మవారి గ్రామోత్సవంలో వేలాదిమంది పాల్గొని భక్తి పారవశ్యంతో పూలు, ఆకులు చల్లుతూ తమ మొక్కులు తీర్చుకున్నారు. కొలువు దీరిన పురం నుంచి మేళతాళాలతో కదిలిన అమ్మవారి కొలుపు ఉత్సవంలో వేలాది మంది భక్తులు అమ్మవారికి అభిముఖంగా పురవీధులలో అడుగులో అడుగు వేస్తూ వెనుకకు నడిచిన తీరు అబ్బురపరిచింది. గ్రామంలో కిక్కిరిసిన జన సందోహంతో పగలు, రాత్రి కొనసాగుతున్న అమ్మవారి గ్రామోత్సవం, కోలాట ప్రదర్శన, ప్రత్యేక వాయిద్యాలతో రాత్రివేళ పురవీధులలో విద్యుత్ ప్రభ ఊరేగింపు, రంగురంగుల విద్యుత్ దీపకాంతులతో సుందరంగా శోభిల్లుతున్న ప్రధాన ఆలయాలు, రాత్రివేళ కనువిందుచేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలతో చందలూరులో ఆధ్యాత్మిక సందడి నెలకుంది.



కొలుపుల్లో అమ్మవారికి అభిముఖంగా నడుస్తున్న భక్తజన సందోహం



కొలువు దీరిన మహాలక్ష్మి అమ్మవారు.

నేడు గ్రామంలో పాలవెల్లి మహోత్సవం

చందలూరులో జరిగే మహాలక్ష్మి అమ్మవారి కొలుపు ఉత్సవంలో 9వ రోజు జరిగే పాలవెల్లి కార్యక్రమం ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అమ్మవారిని బాల స్వరూపిణిగా అలంకరించి బాల మూల మంత్ర జపం చేసి 11 మంది ముత్తయిదువులకు పూలు, గంధం, కుంకుమ అర్పించి బాలభోగాన్ని నిర్వహించడం కార్యక్రమ ప్రత్యేకత. శుక్రవారం తెల్లవారుజామున బాలస్వరూపిణిగా కొలువుదీరిన అమ్మవారికి పొంగించిన పాలపై నెయ్యితో కలిపిన మధుర పదార్థాన్ని నివేదనగా సమర్పించిన అనంతరం 11 మంది ముత్తయిదువులకు పూలు, గంధం, కుంకుమ అర్పించి, పాలు, నెయ్యితో తయారు చేసిన మధుర పదార్థాన్ని భోజనంగా వడ్డిస్తారు. భాలభోగ కార్యక్రమ అనంతరం బాలాత్రిపుర సుందరి మూలమంత్రంతో శుక్రవారం ఉదయం గ్రామోత్సవం నిర్వహిస్తారు. బాల స్వరూపంతో అమ్మవారిని దర్శిస్తే గ్రహపీడలు తొలగిపోతాయని పురాణ కాలం నుంచి ప్రజల నమ్మకం. నేడు జరిగే ఈ ఉత్సవంలో వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి అన్నప్రసాదం స్వీకరిస్తారని బ్రహ్మశ్రీ వేద మూర్తివర్యులు చల్లా సత్యనారాయణశాస్త్రి తెలిపారు. ఈ ఉత్సవంలో సూర్య బలిజ వంశస్తులు నేతి కాగడాలు పట్టి ప్రజలకు శాంతి చేకూరాలని, గ్రామ సౌఖ్యాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేయడం పరిపాటి. శతాబ్దాల కిందట కొలువుదీరిన మహాలక్ష్మి అమ్మవారి కొలుపు మహోత్సవంలో ప్రధాన ఘట్టం పాలవెల్లి అనంతరం శనివారం గ్రామ పొంగళ్ల కార్యక్రమంతో ఉత్సవం ముగియనుంది.



అక్రమ పద్ధతిలో నిధులు డ్రా చేసినా చర్యలేవీ?

ఉప్పుగుండూరు పంచాయతీలో ఎడతెగని పంచాయితీ

గత, ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ కొనసాగుతున్న అక్రమాలు

ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నిబంధనలకు కార్యదర్శి తూట్లు

తాజా విచారణలో రూ.8 లక్షలు డ్రా చేసినట్లు గుర్తించిన అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలో అక్రమ పద్ధతిలో నిధులు డ్రా చేసినా చర్యలు తీసుకున్న పరిస్థితి లేదు. గత ప్రభుత్వంలో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగం చేయడంపై ఉన్నతాధికారులు విచారణ చేసి నిర్ధారణ కావడంతో తాత్కాలికంగా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు. ఆ తర్వాత జాయింట్ సిగ్నేచర్‌తో పంచాయతీ నిధులు డ్రా చేసుకొనేందుకు అవకాశం కల్పించారు. ఆ పంచాయతీ నిధులను ఈఓఆర్‌డీతో పాటు సర్పంచ్ జాయింట్ సిగ్నేచర్‌తోనే నిధులు డ్రా చేయాల్సి ఉంది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చినా నిధుల డ్రా చేసే విషయంలో అధికారులు గతంలో మాదిరి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆ పంచాయతీలో గతంలో ఇచ్చిన జాయింట్ సిగ్నేచర్ నిబంధనలకు తోసిరాజని పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్ కుమ్మక్కై రూ.8 లక్షలు నిధులు డ్రా చేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన ప్రజలు మళ్లీ కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె విచారణకు ఆదేశించారు. ఒంగోలు డీఎల్‌పీవోతో పాటు నాగులుప్పలపాడు ఈఓఆర్‌డీలు వచ్చి విచారణ చేశారు. నిధులు డ్రా చేసినట్లు గుర్తించి జిల్లా పంచాయతీ కార్యాలయానికి నివేదికను పంపారు. ఆ నివేదికకు అనుగుణంగా సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేయగా ఎలాంటి అధికారం లేకపోయినా నిధులు డ్రా చేసిన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల మరో సారి ఆ గ్రామానికి చెందిన శ్రీను అనే వ్యక్తి కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నిధులు డ్రా చేసేందుకు పంచాయతీ కార్యదర్శికి ఎలాంటి అధికారం లేకపోయినా నిధులు డ్రా చేశారని, అందువల్ల చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ఆ పంచాయతీలో అధికారికి ఎలాంటి అధికారం లేకపోయినా నిధులు డ్రా చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

● కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో గురువారం సాయంత్రం రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లాలోని హైవేలు, రాష్ట్ర రహదారులలో సంయుక్త తనిఖీలు నిర్వహించాలన్నారు. తరుచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2024లో జిల్లా జరిగిన రోడ్డు ప్రమాదాలకు సంబంధించి 872 కేసులు నమోదు కాగా అందులో 389మంది మృతి చెందారని పేర్కొన్నారు. అందువల్ల ప్రయాణికుల భద్రతపై ప్రత్యేకంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ముఖ్య కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో రహదారుల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీటీసీ ఆర్.సుశీల, డీఎస్పీ సురేష్ బాబు, వివిధశాఖల అధికారులు దేవానందం, జమున, వెంకటేశ్వర్లు, బేబీరాణి, సుధాకర్, కిరణ్‌కుమార్, విద్యాసాగర్, మునిసిపల్ కమిషనర్లు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డీటీసీ సుశీల

రాష్ట్రస్థాయి మహిళా బీచ్ పోటీల విజేత ప్రకాశం



బీచ్ కబడ్డీ పోటీలలో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

ఒంగోలు(రూరల్), జనవరి16(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి బీచ్ మహిళా కబడ్డీ పోటీల్లో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 15వ తేదీ నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు గురువారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన ఫైనల్స్‌లో ప్రకాశం, ప్రొద్దుటూరు (కడపజిల్లా) టీములు తలపడ్డాయి. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలో ప్రకాశం జట్టు విజయం సాధించింది. ప్రొద్దుటూరు టీమ్ రన్నర్‌గా నిలిచింది. తృతీయ బహుమతిని నెల్లూరు క్రీడాకారులు సొంతం చేసుకున్నారు. ఇక నాలుగో స్థానంలో బాపట్ల, ఐదో విజేతగా గుంటూరు జట్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో ఎన్టీఆర్ క్రీడాపరిషత్ వ్యవస్థాపకుడు శిరిగిరి రంగారావు, డాక్టర్ ఆర్‌వీ.మల్లికార్జునరావు, ముపిరి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, అంచెపోగు వెంకటేశ్వర్లు, గొలిమి శ్రీనివాసరావు, బాబురావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 నుంచి డీజే మెగా క్రికెట్ టోర్నమెంట్

ఒంగోలు కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జన్మదినం పురస్కరించుకుని డీజేఆర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే దామచర్ల చేతులమీదుగా బ్రోచర్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు స్థానిక శర్మాకాలేజీ క్రీడా మైదానంలో జరిగే మ్యాచ్‌లలో విజేతలకు మొదటి బహుమతి రూ.3లక్షలు, రెండవ బహుమతి రూ.2లక్షలు, మూడవ బహుమతి రూ.లక్ష, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఫీల్డర్ బహుతులు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను దామచర్ల అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కె.అప్పాజి, ఉండవల్లి రాము, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ నామినేని కరణ్‌కుమార్ పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, డాక్టర్లు సీతారామయ్య, కిరణ్‌కుమార్

అవీ..ఇవీ

రామలింగయ్యకు ఘన నివాళి


రామలింగయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నారాయణరెడ్డి

కొనకనమిట్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినమన గుండం గ్రామంలో గురువారం చప్పిడి రామలింగయ్య దశదినకర్మ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామలింగయ్య, కొనకనమిట్ల మండలంలో టీడీపీకి చేసిన సేవలు మరువలేనవన్నారు. తను ఒక అన్నను కోల్పోయానని గుర్తుచేశారు. పొదిలి ఏఎంసీ చైర్మన్‌గా చినమనగుండం సర్పంచ్‌గా ప్రజాసేవచేసి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తిని కొనియాడారు. కార్యక్రమంలో మార్కాపురం జనసేన పార్టీ నాయకులు ఇమ్మడి కాశినాద్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మోరబోయిన బాబురావు, మాజీ అధ్యక్షులు వరికూటి వెంకటరామిరెడ్డి, కనకం నరసింహారావు, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి


మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు

మార్కాపురం వన్ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని మార్కాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో భద్రతా మాసోత్సవాలు పురస్కరించుకొని గురువారం ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ.. డ్రైవర్లు ట్రాఫిక్‌రూల్స్ పాటించాలన్నారు. ప్రమాదాలు చోటుచేసుకోకుండా వాహనాలు నడపాలన్నారు. తగు విశ్రాంతి తీసుకోవాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లు వినియోగించరాదని సూచించారు. డిపో మేనేజర్ నరసింహులు మాట్లాడుతూ.. డ్రైవర్లు ఇంధనాన్ని పొదుపు చేస్తూ ఆర్టీసీ ఆదాయం పెంచేలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు, కండెక్టర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు


ఆటోలోని బాక్సులను తొలగిస్తున్న సీఐ, ఎస్సై

ఎర్రగొండపాలెం రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే చర్యలు తీసుకుంటామని ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రభాకరరావు అన్నారు. గురువారం మార్కాపురం - మాచర్ల జాతీయ రహదారిపై ఆటోలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆటోలలో డ్రైవర్ పక్కన రెండు వైపుల ఉన్న బాక్సులను ఆయన తొలగించారు. ఆటోలలో ప్రయాణికులను ఇరికించి ఎక్కించడం వలన ప్రమాదాలు చోటుచేసుకుంటాయన్నారు. అలా జరగకుండా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలన్నారు. రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, పోలీస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోడ్రైవర్లకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎస్సై పి.చౌడయ్య, కానిస్టేబుళ్లు ఉన్నారు.

క్రీడా వికాస కేంద్రం లీజుకు దరఖాస్తుల ఆహ్వానం

మార్కాపురం, జనవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కాపురం క్రీడా వికాసకేంద్రం లీజుకు టెండర్ల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో జి.రాజరాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వాళ్ల ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు టెండర్లను ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ మినీస్టేడియంలో అందజేయాలన్నారు. వివరాలకు 9121106840 నంబరును సంప్రదించాలన్నారు.

ఆటో వెనుకవైపు డోరు క్లోజ్ చేయాలి

గిద్దలూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆటోలకు వెనుక డోర్‌ను మూసి వేయాలని స్థానిక అర్బన్ సీఐ సురేష్ పేర్కొన్నారు. ఆటోడ్రైవర్లు తమ ఆటోలకు వెనుక వైపున తెరచి ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, దాని పైన కూడా ప్రయాణికులను ఎక్కించడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇకనుంచి ఆటోడోర్లు మూతవేయాలని, లేనిపక్షంలో 500 రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు.

విద్యార్థులలో విలువలను పెంపొందించాలి


విద్యార్థులతో స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ సభ్యులు

గిద్దలూరుటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాలలో విద్యార్థులకు నైతిక విలువలను పెంపొందించాలని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు ఫయాజ్ హుస్సేన్ అన్నారు. గురువారం పట్టణంలోని చిన్న మసీదు నందు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫయాజ్‌హుస్సేన్ మాట్లాడుతూ 42 సంవత్సరాలుగా యువకులను చైతన్యపరుస్తూ సమాజ నిర్మాణానికి సంసిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతివారం చిన్నపిల్లలకు, యువకులకు నైతిక శిక్షణ కోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి సెలవుల్లో భాగంగా 13 నుండి 16వ తేది వరకు విద్యార్థులకు నైతిక ఆధ్యాత్మిక సందేశాత్మక శిక్షణ తరగతులను ఎస్ఐవో నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో 50 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎంపీజే సుప్రీం కౌన్సిల్ కన్వీనర్ ఎస్.ఎం.ఖదీర్‌భాషా, సభ్యులు మజీద్, ఇమామ్‌లు అబ్దుల్ రషీద్ మౌలానా, అబ్దుల్‌హక్ మౌలానా, ఉస్మాన్‌హఫీజ్ పాల్గొన్నారు.

బీసీలకు వ్యాపార యూనిట్లు మంజూరు

కంభం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం 2024-25 సంవత్సరానికి బీసీ కార్పొరేషన్ ద్వారా ఆయా కులాల వారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ ద్వారా 89 యూనిట్లు మంజూరైనట్లు ఎంపీడీవో నరసయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఎకనామికల్ వీకర్ సెక్షన్ కింద రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, క్షత్రియ, ఈబీసీ కింద 79 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. తెల్లరేషన్ కార్డు ఉండి 21-60 సంవత్సరాల వయస్సు ఉన్న వారు అర్హులని తెలిపారు. ఈ నెల 19వ తేదిలోగా ఆయా సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పల్లెల్లోనూ మాయదారి మట్కా



- మళ్లీ జడలు విప్పుతున్న జూదం
- రోజుకు లక్షల్లో పందెం
- పేద, మధ్యతరగతి వారిపై వల

కంభం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం, గిద్దలూరు, కంభంలలో కీలకమైన రంగాలకు చెందిన పలువురు వ్యక్తుల అండదండలతో నిర్వాహకులు బహిరంగంగానే మట్కా ఆడిస్తున్నారు.! వందల నుంచి లక్షల స్థాయికి ఈ జూదం పెరిగిపోతున్నది. పోలీసులు కొద్దిరోజుల కిందట మట్కాపై దృష్టి సారించి అరెస్టులు కూడా చేశారు. అయితే తెరవెనుక వ్యక్తులను నియంత్రించ గలిగితే దీనికి అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. చిన్న చేపలను పట్టుకుని పెద్ద చేపలను వదిలివేస్తే ఇలాగే విస్తరించే ప్రమాదం ఉంది. మట్కా ఎక్కువగా వెనుకబడిన ప్రాంతాలలోనే నడుస్తుంది. గిద్దలూరు, కంభం, మార్కాపురం, చీరాలలో ఎక్కువగా నడుస్తోంది. చిన్నపాటి బుక్కర్లు రూ.10 నుంచి రూ.1000 వరకు వసూలు చేస్తుంటారు. అలా సేకరించిన మొత్తాన్ని కీలక వ్యక్తికి అప్పగిస్తారు. అతను నంద్యాల, అక్కడి నుండి గుంతకల్లుకు, చివరకు బొంబాయిలోని ప్రధాన నిర్వాహకులకు ఆ సొమ్ము చేరుతుంది. ఉదయం నుంచి సాయంత్రంలోగా డబ్బులు చెల్లిస్తే అర్ధరాత్రి ఫలితాలు వస్తాయి. ఎవరికైనా డబ్బులు వేస్తే ఆప్రాంతంలోని బుక్కర్ల ద్వారా డబ్బులు పంపిణీ చేస్తారు. ఎక్కువ మొత్తంలో అయితే రెండు రోజుల సమయం పడుతుంది. పోలీసులు ఎక్కువగా చిన్నపాటి బుక్కర్లనే అరెస్టు చేస్తుంటారు. ఈ సమయంలో కీలకమైన వ్యక్తులు అజ్ఞాతంలోకి వెళ్లి కొన్నాళ్లు బయటకు రావడం లేదు. ప్రస్తుతం గుంతకల్లు నుంచి నంద్యాల నుంచి వినుకొండ వరకు బుక్కర్లు రైలు ప్రయాణం సాగిస్తూ సెల్‌ఫోన్ ద్వారా మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. పట్టణాలకే పరిమితమైన బుక్కర్లపైనేకాక భారీ ఎత్తున నగదు సేకరించే కీలక వ్యక్తులపై దృష్టి పెట్టి వారిని నిరోధిస్తేనే మట్కాను అదుపుచేసే వీలుంటుంది.

పేద, మధ్యతరగతి వారే లక్ష్యం

సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశ చూపి కొందరు స్వార్థపరులు ఈ ప్రాంతానికి మట్కా జూదాన్ని మూ డు దశాబ్ధాల క్రితమే పరిచయం చేశారు. కొద్ది మొత్తం మట్కాలో పెడితే వందలు, వేలు సంపాదిం చవచ్చని ఆశల వల విసురుతున్నారు. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల నుంచి రోజూ వేలకు వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఉచ్చులో చిక్కుకుని కష్టార్జితాన్ని వారు పోగొట్టుకుంటున్నారు. దీంతో కుటుంబాలు గుల్ల అవుతున్నాయి. తొలుత బస్టాండ్లు, టీస్టాల్స్ వద్ద జరిగేది. ఇప్పుడు అన్ని ప్రాంతాలకు విస్తరించింది.

జూదం ఇలా

మొదటి అంకెను ఓపెనింగ్ అని, రెండో అంకెను క్లోజింగ్ అని పిలిచేవారు. బొంబాయి నుండి చార్టులు వచ్చేవి. వ్యవహారమంతా ల్యాండ్‌ఫోన్ల ద్వారా నడిచేవి. ప్రస్తుతం సెల్‌ఫోన్ ద్వారా మట్కా కొనసాగిస్తున్నారు. పోలీసుల దాడులు ఎక్కువ కావడంతో గుట్టుచప్పుడు కాకుండా సాగుతూనే ఉంది.

కఠిన చర్యలు తీసుకుంటాం

మట్కా వ్యవహారంపై కఠినంగా వ్యవహరిస్తాం. ఎక్కడైనా మట్కా, ఇతర జూద కార్యకలాపాలు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలో మట్కా నిర్వహించే ప్రాంతాలపై దాడులు నిర్వహించి అరెస్టులు చేశాం. ఇంకా మట్కా సెల్‌ఫోన్‌ల ద్వారా నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా మట్కా విషయంపై సమాచారం ఇస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. - మల్లికార్జున్, సీఐ కంభం

వైభవంగా యోగయ్యస్వామి తిరునాళ్ల


విద్యుత్ దీపాలతో అలంకరించిన ఆలయం


ఎండూరివారిపాలెంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

త్రిపురాంతకం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమేపల్లి, ఎండూరివారి పాలెం గ్రామాల్లో యోగయ్యస్వామి తిరునాళ్లను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్థులతోపాటు దూరప్రాంతాల భక్తులు యోగయ్య స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు భోజన ఏర్పాట్లతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎండూరివారిపాలెంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు రక్తదాన శిబిరం

గిద్దలూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వర్ధంతి సందర్భంగా ఈ నెల 18న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక టీడీపీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం 8గంటల నుండి రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని, కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రారంభి స్తారని తెలిపారు. పట్టణంలోని విశా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఎన్‌టీఆర్ వర్ధంతి కార్యక్రమాలు, మహారక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృష్ట్యా నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. రక్తదానం చేయదలచిన వారు 6301252227, 9502370324 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రేపు నవోదయ ప్రవేశపరీక్ష

ఒంగోలు విద్య, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జవహర్ నవోద య విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశా నికి విద్యార్థులను ఎంపిక చేసేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తు న్నట్లు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశపరీక్షకు 5,484 మంది విద్యార్థులు దరఖాస్తు లు చేసుకున్నారు. పరీక్ష ఉదయం 11 గంటలకు ప్రారంభం కానుంది. విద్యార్థులు పరీక్ష సమయానికి అర్ధగంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. తమ హాల్‌టిక్కెట్‌తో పాటు ఆధార్ జెరాక్స్ కాపీతో పరీక్షకు హాజరుకావాలన్నారు. బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్‌తో సమాధానాలు గుర్తించాలని సూచించారు. విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కందుకూరు బాలుర, బాలికలు, సింగరాయకొండ బాలికల, వీవీపాలెం, మార్టూరు జడ్పీ హైస్కూలు, ఒంగోలు బండ్లమిట్టబాలికోన్నత, అద్దంకి బాలుర, బాలికలు, మద్దిపాడు, కొండపి, టంగుటూరు, సింగరాయకొండ, చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కొండపి, మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఒంగోలు పీవీఆర్ బాలికలు, రామనగర్, డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ స్కూలు, పర్చూరు వైఆర్, నాగులపాలెం, చీరాల ఎన్‌ఆర్అండ్‌పిఎం, కేజీఎం హైస్కూలు, వలేటివారిపాలెం ఏపీ మోడల్ స్కూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసిన గీతాలక్ష్మి తెలిపారు.

అతిథి గృహానికి ఆలనా పాలన కరువు

అపహరణకు గురైన ఫర్నీచర్


ఫర్నీచర్ లేకుండా నిరుపయోగంగా మిగిలిన గెస్టహౌస్

కంభం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కంభం చెరువుకట్టపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన గెస్టుహౌస్ ఆలన పాలన లేక పోవడంతో దొంగలు గెస్టుహౌస్‌కు ఏర్పాటు చేసిన విలువైన తలుపులు, కిటికీలు, ఫర్నీచర్‌ను ఎత్తుకు పోయారు. దీంతో ఆ గెస్ట్ హౌస్ నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం ఇది తాగుబోతులకు, పేకాటరాయుళ్లకు నిలయంగా మారింది.

బ్రిటీష్ వాళ్ల పరిపాలించిన కాలంలో అధికారులు విశ్రాంతి తీసుకునేందుకు విశాలమైన గెస్టుహౌస్‌ను నిర్మించారు. ఆ తరువాత ఈ భవనం ఇరిగేషన్‌శాఖ పరిధిలోకి వచ్చింది. అయితే భవనానికి కాపలా లేకపోవడంతో రెండ దశాబ్ధాల క్రితం టేకుతో నిర్మించిన తలుపులు, కిటికీలు, లోపల ఫర్నీచర్ మొత్తాన్ని దొంగలు ఎత్తుకుని పోయారు. అప్పటి నుంచి పాడుపడింది. చెరువుకట్ట వద్దకు వచ్చిన ప్రజలు స్నానం చేసి దుస్తులు మార్చుకు నేందుకు ఈ గెస్టుహౌస్ ఉపయోగపడేది. తలుపు లు, కిటికీలు లేకపోవడం తో ఎవరు వెళ్ళలేని పరిస్థితి. ఇరిగేషన్ అధికారులు దశాబ్దం క్రితం గెస్టుహౌస్ పునఃనిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయించారు. గెసుహౌస్‌ను మళ్లీ వినియోగంలోకి తెచ్చారు. అయితే చెరువుకట్టపై విద్యుత్ సౌకర్యం లేక పోవడం, వాచ్‌మెన్ లేకపోవడంతో రాత్రివేళ దొంగలు సామగ్రిని దొంగిలించారు. దీంతో మళ్లీ పాడుపడ్డ బిల్డింగ్‌గా మారింది. ఇప్పటికైనా అధికారులు గెస్టుహౌస్‌ను పునఃనిర్మించి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి ఉపయోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

అదుపు తప్పి ఢీకొన్న కార్లు


ఒకదాన్ని ఒకటి ఢీకొన్న కార్లు

నాగులుప్పలపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అదుపు కారు ముందు వెళుతున్న కారును ఢీకొనగా ఆ వాహనాన్ని వెనక ఉ న్న మూడుకార్లు ఢీకొ న్న సంఘటన నాగులుప్పలపాడులోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై జరిగింది. స్థానికుల సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం నాగులుప్పలపాడు బస్టాం డ్ జంక్షన్ వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఒంగోలు వైపు వెళుతున్న వాహనాలు ఎడమ వైపు వరుస క్రమంలో వెళుతున్నాయి. ఈ క్రమంలో ముందు వెళుతున్న కారును వెనక నుంచి వచ్చిన మరో కారు వేగంగా ఢీకొంది. దీంతో దానికి వెనక ఉన్న మూడో కార్లు ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆయా కార్ల ముందు, వెనక బాగాలు దెబ్బతి న్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

చీమకుర్తి మండల అభివృద్ధికి మార్గం సుగమం

- 50-40-10 దామాషాలో రూ.20కోట్ల మండల నిధుల వినియోగం
- ఇరువురి అధినేతల మధ్య కుదిరిన అవగాహన

చీమకుర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): చీమకుర్తి మండల పరిషత్ నిధుల వినియోగంలో నెలకొన్న ప్రతిష్టంభన, మడతపేచీలకు ఎట్టకేలకు పరిష్కారం దొరకనుంది. పంతాలు, పట్టింపులు, పార్టీలను పక్కనపెట్టి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మండల అభివృద్ధి కోసం ఇరు పార్టీలకు చెందిన అధినేతల మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మండల నిధుల వినియోగంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారమార్గంగా మారింది. మండలంలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి, అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారుల నిర్మాణం, శ్మశానాల అభివృద్ధి, అలాగే సీసీ, బీటీ రహదారులు, సైడ్‌కాలువల నిర్మాణం తదితర పనులను దాదాపు రూ.20కోట్లకు పైగా ఉన్న మండల నిధులతో చేపట్టనున్నారు. కాగా ఈ ని . ధుల వినియోగంలో ఆరునెలల నుంచి నెలకొన్న మడతపేచి ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద రెడ్డిల చొరవతో మార్గం దొరికింది. గతనెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఇరుపార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు నిధుల వినియోగంలో నెలకొన్న ప్రతిష్టంభనపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. నిధులున్నా పనులు ఏమీ చేయలేకపోతున్నారని గ్రామాల్లో ప్రజలు ప్రశ్నించడంపై చర్చించారు. ఈ మేరకు ఇరుపార్టీల ప్రజాప్రతినిధులు వారి అధినేతలకు ఈ సమస్యను వివరించి పరిష్కారించాలని విన్నవించుకున్నారు. మండల పరిషత్ వైసీపీ చేతిలో ఉండగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉండటంతో నిధులు వినియోగించాలంటే మండల పాలకవర్గం నుంచి పనులకు ఆమోదం, తర్వాత టెక్నికల్ అనుమతులకు ప్రభుత్వం అనుమతి తప్పనిసరైంది. రెండుచేతులు కలిస్తేనే చప్పట్లు మోగే పరిస్థితి ఏర్పడింది. మండలంలో నిధులున్నాయనే పల్లె పండగకు ప్రభు త్వం కేటాయించిన నిధుల్లో చీమకుర్తి మండలాన్ని మినహాయించి మిగతా మూడు మండలాలకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ నిధులు కేటాయించారు. గత రెండునెలలుగా ఆ మూడు మండలాల్లో అభివృద్ధి పనులు చకచకా జరగటం, చీమకుర్తి మండలంలో పల్లెపండగ కనపడని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మండల నిధుల వినియోగంపై నెలకొన్న ప్రతిష్టంభన పరిష్కరించాలని బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఫోన్‌లో బీఎన్. విజయ్‌కుమార్‌ను కోరారు. మండల అభివృద్ధి కోసం ఇరువురి మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. మండలంలో ఉన్న నిధులలో 50శాతం టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మరో 40శాతం వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పనులు నిర్వహిస్తారు. మిగిలిన 10శాతం నిధులు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ సూచించిన మేరకు అత్యవసర పనులకు వినియోగించే నిమిత్తం కేటాయించారు. ఈ అవగాహన మేరకు గ్రామాలకు ఎంతెంత నిధులు కేటాయించాలి, ఎలాంటి పనులు నిర్వహించాలనే విషయంపై అధికారులు సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసుకుని ఖరారు చేసుకోవాల్సింది. ఈ పని పూర్తయితే అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ఖరారైన మేరకు పనుల నిర్వహణకు సభ్యుల ఆ మోదం పొందనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సబ్‌జూని యర్ హాకీ పోటీలకు మైనంపాడు ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ వనజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మదనపల్లిలో జరిగే రా ష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను ఇ న్‌చార్జ్ హెచ్ఎం ఓబుల్, హాకీ మైనంపాడు అధ్యక్షుడు జి.కాలేషా, పీఈ టీ రవికుమార్‌లు అభినందించినట్లు ఆమె తెలియజేశారు.

మాలల అణచివేత కుట్రను తిప్పికొట్టండి

సంతనూతలపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మాలల అణచివేత కుట్రలను తిప్పికొట్టాలని మాల మహాసభ జా తీయ అధ్యక్షుడు మ ల్లె వెంకట్రావు పేర్కొ న్నారు. గురువారం పేర్నమిట్ట అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమావేశంలో ఆయన మాట్లా డారు. పేద వర్గాల, ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న మాలలను అణచివేయాలని కుట్రలు చేయాలని చేస్తున్నారని, దీనిని అడ్డుకోవా ల్సిన అవసరం ఉందన్నారు. ఫిబ్రవరి 15న చీమకుర్తిలో జరిగే మాలల కళల జాతరను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీ.రత్నా కర్, సీహెచ్.వెంగళరావు, ఎన్.శరత్, శేషయ్య, సుబ్బారావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో


మార్కాపురం మండలం పెద్దయాచవరంలో మొక్కజొన్న పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

గిద్దలూరుటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిష్టర్ ద్వారా ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఉంటుందని ఏవో విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ముండ్లపాడు, బురుజుపల్లె గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖల్లో ఫార్మర్ రిజిష్టర్ వెబ్‌సైట్‌లో రైతుల వివరాలు నమోదు చేస్తారన్నారు. రైతు రిజిష్టర్ పోర్టర్‌లో నమోదు చేసిన తరువాత రైతుకు ప్రత్యేక సంఖ్య కేటాయిస్తారన్నారు. అన్ని రైతుసేవా కేంద్రాలలో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. భూమి ఉన్న రైతు, కౌలు రైతు, వ్యవసాయ కూలి, వ్యవసాయ ఆధారిత వృత్తులపై జీవించే వారు అర్హులన్నారు. రైతు ఆధార్ నెంబరు, పట్టాదారు పాస్‌పుస్తకం, చెరవాణి నంబరుతో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం మొక్కజొన్న, కంది, మొదలైన పంటలను పరిశీలించి చీడపీడల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, గ్రామవ్యవసాయ సహాయకులు రవి, కిరణ్మయి, పశుసంవర్ధకశాఖ సహాయకులు సౌజన్య పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : సస్యరక్షణ చర్యలతోనే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని పెద్దయాచవరం, పెద్ద నాగులవరం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం రైతులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాలలో రైతులు సాగుచేస్తున్న మొక్కజొన్న, అలసంద పైరును పరిశీలించి పలు సలహాలు సూచనలు ఇచ్చారు. రైతులు సాగుచేస్తున్న ప్రతి పంటను ఖచ్చితంగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు : శనగ పంటపై ప్రస్తుతం పచ్చ పురుగు, ఎండు తెగులు ఉందని, దీని నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సీతానాగులవరం, గోరుగుంతలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ, కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శనగ పంటపై పచ్చపురుగు నివారణకు హెటెండ్‌మెంట్ 50మి.మీ.లను ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పూర్ణశంకర్, బాబు, గోవింద్ బాషా, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మినుములో కాయతొలుచు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని ఏవో జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని జమ్మిదోర్నాల, చిన్న దోర్నాల గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో జవహర్‌లాల్ నాయక్ ఆయా గ్రామాల్లో రబీ సీజనులో సాగు చేసిన మినుము, జొన్న పంటలను పరిశీలించారు. మినుములో కాయతొలుచు పురుగు, బూడిద తెగులు ఆశించడాన్ని గమనించారు. నివారణ చర్యలు చేపట్టాలని సూచిం చారు. కాయతొలుచు పురుగు నివారణకు ఫ్లబెండియమైడ్ 20శాతం, ఎస్‌సీ, 300 గ్రాముల మందును 500 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. బూడిద తెగులు నివారణకు వెటబుల్ సల్ఫేర్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. అనంతరం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో చైతన్యకుమార్, సహాయకులు రాజేంద్రప్రసాద్, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : శనగ పంటపై ప్రస్తుతం పచ్చ పురుగు, ఎండుతెగులు ఉందని, దీని నివారణకు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో టి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని సీతానాగులవరం, గోరుగుంతలపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శనగ, కంది, మిరప పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శనగ పైరుపై పచ్చపురుగు నివారణకు హెటెండ్‌మెంట్ 50మి.మీ.లను ఎకరాకు పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పూర్ణ శంకర్, బాబు, గోవింద్ బాషా, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా రామయోగి స్వామి తిరునాళ్ల



రామయోగి సమాధి

కురిచేడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్లపాడు గ్రామంలో రామయోగి స్వామి తిరునాళ్ల గురువారం వైభవంగా జరిగింది. భక్తులు ఉదయం నుంచే స్వామి వారి సమాధి వద్ద దర్శనానికి బారులు తీరారు. పోలీసులు, ఆలయ కమిటీ వారు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. మహిళా భక్తులు పొంగళ్ళు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు దాతలు అన్నదానం నిర్వహించారు. ఎస్ఐ శివ, తహసీల్దార్ రజనీకుమారిలు దగ్గరుండి బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వరిలో తెగుళ్ల నివారణకు చర్యలు తీసుకోవాలి

పామూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వరి పైరుకు కాండం కుళ్లు తెగులు ఆశించిందని ఏవో కె.రాధ పేర్కొన్నారు. గురువారం మండంలోని తూర్పుకట్టకిందపల్లి, ఇనిమెర్ల గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా సాగులో ఉన్న వరి పైరును పరిశీలించారు. దీని నివారణకు తగు సూచనలు చేశారు. అనంతరం ఇనిమెర్ల గ్రామంలో రైతులకు పంట నమోదు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ యామిని, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ ధర్మకర్తల మండలి ఏకగ్రీవం

కురిచేడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని వీరబ్రహ్మేంద్రస్వామిగారి దేవాలయం ధర్మకర్తల మండలి గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయ నిర్మాణ కమిటీ, విశ్వబ్రాహ్మణులంతా కలసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ధర్మకర్తగా షైలోజి పరబ్రహ్మాచారి, ద్వితీయ ధర్మకర్తగా పెసరపాటి చిన్నవెంకయ్యను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్.వీరబ్రహ్మాచారి, కేవీ రత్నాచారి, పి.అల్లూచారి, ఉప్పుటూరి గోపి, సీహెచ్ నాగరాజు, కె.కొండలు, జూపూడి గురుకాంతాచారి, పవన్ కుమారాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో చిల్లచెట్ల తొలగింపు

పామూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీమదన వే ణుగోపాలస్వామి దేవస్థానానికి సంబంధిచిన భూముల్లో ఉన్న చిల్లచెట్లను తొలగించారు. ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు ఆధ్వర్యంలో గురువారం సర్వే నెంబర్ 429/1లోని 1.68 సెంట్లు, 424/6లో 37 సెంట్ల భూమిలో ఎక్స్‌కవేటర్‌తో భూమి చదునుచేసే కార్యక్రమం చేపట్టారు. ఆలయ భూముల్లో ఆక్రమణలకు పాల్పడితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామన్నారు. దేవ స్థాన భూముల్లో ఆక్రమంగా వేసిన లేఔట్లలో ప్లాట్లుకొని మోసపోవద్దన్నా రు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కేవీ రమణయ్య, బండ్ల నారా యణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు రేషన్ షాపులు మంజూరు

ముండ్లమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు కొత్తగా రేషన్ షాపులు మంజూరు చేసినట్లు తహసీల్దార్ ఆర్.లక్ష్మీనారాయణ తెలిపారు. వెయ్యి కార్డులకు పైగాఉన్న రేషన్ షాపులను రెండుగా చేసినట్లు చెప్పారు. పసుపుగల్లు, పెద ఉల్లగల్లు, పులిపాడు, పోలవరం గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న ఒక్క షాపును రెండు షాపులుగా చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం షాపులు నిర్వహిస్తున్న డీలర్లకు నోటీసులు ఇచ్చామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని తహసీల్దార్ పేర్కొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ముండ్లమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూరిమెట్లలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు గురువారం మాజీ ఎంపీపీ కోడెగ మస్తాన్‌రావు, ఎంపీటీసీ చింతపల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొత్తం 16 జట్లు పోటీల్లో పాల్గొనగా విజేతగా మండలంలోని ఈదర జట్టు గెలుపొందింది. వీరికి రూ25,116 బహుమతిని అందజేశారు. ద్వితీయ బహుమతి పల్నాడు జిల్లా వినుకొండ మండలం తెల్లబాడు జట్టు రూ.15,116 అందజేశారు. కార్యక్రమంలో చొప్పరపు నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వర్లు, నిడిగంటి నారాయణ, రమణాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల ముసుగులో వ్యాపారుల దోపిడీ

» మత్స్యకారుల నోరు కొడుతున్న అక్రమార్కులు



సొసైటీ పేరుతో వ్యాపారులు చేపలు పెంచుకుంటున్న చెరువుకొమ్ముపాలెం చెరువు

దర్శి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సొసైటీల మాటున వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. మత్స్యకారులు చేపలు పెంచుకోవాల్సిన చెరువులను వ్యాపారులు కైవసం చేసుకొని లబ్ధిపొందుతున్నారు. మత్స్యశాఖ అధికారులు తమకు ఏమి సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, తూర్పువీరాయపాలెం, పులిపాడు చెరువులు ఒక సొసైటీ కింద ఉన్నాయి. మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలనే లక్ష్యంతో చేపల పాటల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం వదులుకొని ఆ చెరువులను సొసైటీలకు కేటాయించారు మత్స్యకారులు చేపలను పెంచుకొని జీవనోపాధి మెరుగు పర్చుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అక్రమార్కులకు కల్పవృక్షంగా మారుతున్నాయి. వాస్తవంగా ఆ చెరువులకు పాటలు పెడితే రెండు కోట్ల రూపాయలు ధర పలుకుతుంది. సొసైటీల పేరుతో నామమాత్రం ఫీజు చెల్లించి అక్రమార్కులు యథేచ్ఛగా చేపలు పెంచుకొని, విక్రయించి భారీగా లబ్ధి పొందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈతంతు సాగుతోంది. గత వైసీపీ హయాంలో అక్రమాలకు అడ్డూ అదుపూ లేకుండా పోవటంతో పట్టించుకున్న నాథుడే లేడు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనైనా ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తారని ప్రజలు భావిస్తున్నారు.

అక్రమ వెంచర్ల తొలగింపునకు చర్యలు

» ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు లోబడి లే అవుట్లు వేయాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన అక్రమ లేఅవుట్ల నియంత్రణ, సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కనిగిరి నియోజకవర్గంలో అసైన్డ్ భూముల్లో వేసిన అక్రమ వెంచర్లను తొలగించి స్వాధీనం చేసుకుంటున్నట్లు చెప్పారు. వాటిని ప్రభుత్వ అవసరాలకు వినియోగించటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం లే అవుట్లు వేయదలచినవారు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలన్నారు. నిబంధనల మేరకు వెంచర్లు వేసేవారికి ప్రభుత్వం ద్వారా ఆయా లేఅవుట్లో వివిధ సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కనిగిరి పట్టణ పరిధిలో వేసే వెంచర్లకు అనుమతులను మున్సిపల్‌శాఖ నుంచి మాత్రమే పొందాలన్నారు. ఐదు అంతస్థుల ఇళ్ళ నిర్మాణాల అనుమతులు కూడా ఇకనుంచి కనిగిరి పట్టణంలోని మున్సిపల్‌శాఖ నుంచి అనుమతి పొందే అవకాశం ప్రభుత్వం కల్పిస్తూ జీవో ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వెంచర్లను వేసే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో కనిగిరి, సీఎస్‌పురం తహసీల్దార్‌లు రవిశంకర్, మంజునాధరెడ్డి, మున్సిపల్ కమిషనర్ జోసఫ్ డానియేల్, టీపీవో సువర్ణకుమార్, సబ్‌రిజిస్ట్రార్ వాసుదేవరెడ్డి, ఉడా అధికారులు శారదాదేవి, పృధ్వీరాజ్ పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ప్రభుత్వాధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో జరిగిన లేఅవుట్ల అనుమతులు మంజూరు సమన్వయకమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలో అక్రమంగా వేసిన లే అవుట్లను గుర్తించాలని సూచించారు. గతంలో కనిగిరిలో వేసిన వెంచర్లను పరిశీలించాలన్నారు. ఫీల్డ్‌లో ఆయా వెంచర్లు ఏఏ సర్వే నెంబర్లలో ఉన్నాయో గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా పనిచేసేవారు బదిలీపై వెళ్ళిపోవచ్చని తెలిపారు. లేకుంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకవెళ్ళి శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చురక లంటించారు. సమావేశంలో రెవెన్యూ, రిజిస్ట్రార్, మున్సిపల్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర ఉగ్ర

కనిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా రక్తపరీక్ష, డయాలసిస్ కేంద్రాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి అందుతున్న వైద్యసేవలపై విచారించారు. డయాలిసిస్ కేంద్రంలో వైద్యం పొందుతున్న కిడ్నీ బాధితులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అధునాతన పరికరాల ద్వారా కిడ్నీ బాధితులకు వైద్య సేవలు అందించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వాసుపత్రి సేవలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రిలో ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యంతో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ఆరు నెలల వ్యవధిలో ప్రయివేటు ఆసుపత్రుల తరహాలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నాణ్యమైన వైద్యం అందించే ప్రక్రియలో తమ పార్టీ శ్రేణులు వలంటీర్లుగా వ్యవహరిస్తారన్నారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు వైద్యులకు అనుసంధానకర్తలుగా ఉంటూ మెరుగైన వైద్యం అందేలా సేవలు అందించాలని మాజీ కౌన్సిలర్, ఆసుపత్రి హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు బుల్లా బాలబాబుకి సూచించారు. ఎప్పటికప్పుడు ఆసుపత్రి వైద్యంపై వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పుల విభాగంలో కార్పొరేట్ ఆసుపత్రి కంటే మిన్నగా పరికరాలు, మిషనరీ, సామగ్రి సమకూర్చినట్లు డాక్టర్ ఉగ్ర తెలిపారు.

గైనకాలజిస్ట్‌ను కూడా నియమించినట్లు చెప్పారు. వారు అత్యుత్తమ వైద్యసేవలు అందించటంతో పాటు కాన్పులతో పాటు, ఆపరేషన్‌లు చేయటం జరుగుతుందన్నారు. లక్షలు ఖర్చు చేసి ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వాసుపత్రిలో అందుతున్న మెరుగైన, ఉచిత వైద్యసేవలు పొందాలని డాక్టర్ ఉగ్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ తిరుపతిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

» అడ్డుకున్న వెలుగువారిపాలెం గ్రామస్థులు



ఎర్రకొండమట్టి తరలింపును అడ్డుకున్న వెలుగువారిపాలెం గ్రామస్థులు

తాళ్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-బెంగుళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి కొండను తవ్వి గ్రావెల్ తరలించడాన్ని మండలంలోని వెలుగువారిపాలెం గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామానికి సమీపాన గల బొద్దికూరపాడు సర్వే నంబర్ 489లోని 664 ఎకరాల్లో ఎర్రకొండ ఉంది. గత ప్రభుత్వ హయాంలో హైవేరోడ్డు నిర్మాణానికి పంచాయతీ తీర్మాణంమేరకు ఒకటిన్నర హెక్టార్లలో గ్రావెల్ తీసుకునేందుకు మైనింగ్ అధికారుల అనుమతి పొందేందుకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రతిపాదనలు పంపారు. మైనింగ్ అధికారుల అనుమతి రాకున్నా గత ఆరు నెలులుగా యథేచ్ఛగా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. వెలుగువారిపాలెం, బొద్దికూరపాడు, రెడ్డిసాగర్ గ్రామాలకు చెందిన పశువులు, మేకలు, గొర్రెలను ఈ కొండవద్దకే మేతకు తీసుకువెళుతుంటారు.

జిల్లాలోని పలు గ్రామాలకు మంచినీరు అందించే రామతీర్థం రిజర్వాయర్ ఈకొండ అంచునే ఉంది. రోడ్డు నిర్మాణ సంస్థవారు ఈ కొండ రహదారి పనులకు దగ్గరిగా ఉండటంతో కొండ మట్టిని తరలిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం పశువుల, గొర్రెల, మేకల పెంపకందారులు కొండ వద్దకు మేతకు వెళ్లగా కొండనంతా తమ ఇష్టానుసారం తవ్వి తరలిస్తున్నారు. కొండను నామ రూపాల్లేకుండా చేస్తే తమకు ఇబ్బందులు వస్తాయని పెంపకం దారులు ప్రశ్నించారు. తాము గ్రామంలో కొందరికి రూ.కోటి 90 లక్షలు చెల్లించామని, వారి అనుమతితోనే కొండ మట్టిని తరలిస్తున్నామని సమాధానం చెప్పారు.

దీంతో కొండకు మేతకు వెళ్లే పశువుల పెంపకందారులు బుధవారం గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో కొందరు రోడ్డు నిర్మాణ నిర్వాహకుల వద్ద దాదాపు కోటి 90లక్షలు తీసుకుని మిన్నకుండటం వల్ల భవిష్యత్తులో మేతకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. అందరూ మట్టి తరలింపు జరుగకుండా ఉండేందుకు కొండవద్దకు రావాలని గ్రామంలో దండోరా వేశారు. దీంతో గురువారం గ్రామస్థులు, పశువులు, జీవాల పెంపకందారులు కొండ వద్దకు వెళ్లారు. కొండపై ఉన్న ఎక్స్‌కవేటర్లను, టిప్పర్లను కిందికి దింపారు. గ్రామసమీపాన రోడ్డు వేస్తామంటే పంచాయతీ వారు ఒకటిన్నర హెక్టారులో గ్రావెల్ తరలింపునకు తీర్మానం చేశారు. తమ గ్రామసమీపాన రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. అయితే, వంద కిలో మీటర్ల రోడ్డు వేసేందుకు తమ కొండ మట్టిని తరలించడాన్ని ప్రశ్నించారు. కొండను తవ్వుకునేందుకు ఎవరికి డబ్బులు ఇచ్చారో వారి పేర్లు వెల్లడించాలని రోడ్డు నిర్మాణ నిర్వాహకులను నిలదీశారు. దీంతో వారు నీళ్ల నమిలి మేము అలా అనలేదని తప్పుకున్నారు. తమ కొండనుంచి మట్టి తరలించ వద్దన్నారు. ప్రస్తుతం కొండ మట్టి తవ్వకాన్ని నిలిపివేశారు.

కార్యక్రమంలో గ్రామపెద్దలు ముచ్చుమర్రి బ్రహ్మారెడ్డి, చేరెడ్డి సుబ్బారెడ్డి, వెలుగు తిరుపతయ్య, కన్నా పెదరాములు, అచ్చయ్య, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, వార్డు సభ్యుడు లింగయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

దిగజారిన మిర్చి ధరలు

» నల్లి, కొమ్మ తెగులుతో తగ్గిన దిగుబడి
» పెట్టుబడులు రావటం అంతంతమాత్రమే
» రైతుల ఆందోళన



ఉమామహేశ్వర అగ్రహారంలో మిరపకాయలను కోస్తున్న కూలీలు

ముండ్లమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్చి రైతులను తెగుళ్లు వెన్నువిరుస్తున్నాయి. పంటకు సోకిన తెగుళ్లతో ఆశించిన విధంగా దిగుబడులు రావడంలేదు. దీనికితోడు ధర కూడా పడిపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది మిర్చికి నల్లి తెగులు, ఎండు కొమ్మ తెగులు, దోమ ఉధృతితో దిగుబడులు తగ్గిపోయాయి. ప్రస్తుతం మండలంలో ముమ్మరంగా మిర్చి కోతలు మొదలయ్యాయి. కోసిన మిర్చిని కల్లాల్లో ఆరబెడుతున్నారు. మొదటి కోతలో ఎకరానికి పది క్వింటాలు రావాల్సిఉండగా, తెగుళ్ళ ప్రభావంతో రెండు మూడు క్వింటాళ్ళకే పరిమితమైంది. చివరికి ఎకరానికి 20 క్వింటాళ్ళు కూడా వచ్చే పరిస్థితి కన్పించటం లేదు. ధరలు కూడా తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం కష్టమే. దీంతో అప్పులు మూటకట్టుకోవల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో 2600 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఒక్క ఉమామహేశ్వర అగ్రహారంలోనే 1500 ఎకరాలకు పైగా సాగు చేశారు. తమ్మలూరు, నాయుడుపాలెం, పూరిమెట్ల, సుంకరవారిపాలెం, పసుపుగల్లు, ముండ్లమూరు, శంకరాపురం, నూజెండ్లపల్లి, మారెళ్ళ, ఉల్లగల్లు, రెడ్డినగర్, రామకృష్ణాపురంలలో ఎక్కువగా మిర్చి పంటను సాగు చేశారు. ఎక్కువ మంది రైతులు ఈ ఏడాది తేజా డీలక్స్, 341, బాడుగ అనే రకాలను సాగు చేశారు.

తెగుళ్ళతో కోలుకోలేని దెబ్బ

ఈఏడాది మిర్చి పంటకు నల్లి, ఎండు కొమ్మ తెగులుతో పాటు దోమ పాటు విపరీతంగా సోకాయి. వీటిని అదుపు చేసుకొనేందుకు రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే ఎకరానికి రూ. ఒక లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎన్ని మందులు వాడినా తెగుళ్ళు అదుపులోకి రాలేదు. కొన్నిచోట్ల సగంలోనే పంటను వదిలేశారు.

పెరిగిన ఖర్చులు...తగ్గిన దిగుబడి

మిర్చి పంటకు తెగుళ్ళు సోకటం వల్ల పంట ఎదుగుదల లోపించింది. దీంతో దిగుబడి సైతం తగ్గిపోయింది. కేవలం ఎకరానికి 30 క్వింటాళ్ళ దిగుబడి రావాల్సి ఉండగా 15 నుంచి 20 క్వింటాళ్ళ లోపే దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆశాజనకంగాలేని ధరలు

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు ఆశించిన ధర లేదు. తేజా డీలక్స్ రకాన్ని రూ.14 వేల నుంచి రూ.15 వేల వరకే కొనుగోలు చేస్తున్నారు. 341 రకాన్ని రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకే పలుకుతుంది. ఆర్మూరు రకాన్ని రూ.9 వేల నుంచి రూ.10వేల వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సీఎస్‌పురం(పామూరు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సరైన రహదారులు ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. గురువారం సీఎస్‌పురం మండలం పెద్దగోగులపల్లి ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలలలోనే ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలో రూ.25 కోట్లలో సీసీ రోడ్లు మంజూరుచేసి నిర్మాణ పనులు పూర్తిచేశామన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ

పామూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల సందర్భంగా పట్టణంలో నిర్వహించిన ఆటలపోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక కందుకూరు రోడ్డులో సూర్యచంద్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహించారు. బుధవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో విజేతలకు టీడీపీ నాయకులు యారవ శ్రీనివాసులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య న్యూట్రిమిక్స్ ప్రొడక్ట్ అధినేత్రి డీవీ మౌనిక, నీరుకట్టు నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, వాసవీమాత దేవస్థానం వద్ద నిర్వహించిన పోటీల్లో విజేతలకు దేవస్థాన కమిటీ చైర్మన్ యోల్పూరి బాలకొండలరావు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో దరిశి మస్తాన్‌రావు, కె.హరగోపాల్, ఆర్.కిష్టయ్య, ఆర్.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెల్లూరుకు చెందిన శారదమణిచే అలంకరించిన అమ్మవారి దశవాతరాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అలాగే, సీఎస్‌పురం మండల కేంద్రంలో జరిగిన కేఎస్ రాయల్ అండ్ ఎస్వీ ప్రసాద్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుపాటి వెంకటేష్ బహుమతులు అందజేశారు.

క్రికెట్ విజేత పెదఅలవలపాడు జట్టు

పీసీపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పెదఅలవలపాడు జట్టు విజేతగా నిలిచింది. ఈనెల 7 నుంచి నిర్వహించిన ఈపోటీల్లో 30 టీంలు పాల్గొన్నాయి. గురువారం పెదఅలవలపాడు, పెదయిర్లపాడు జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పెదఅలవలపాడుజట్టు విజయం సాధించింది. విజేతలకు రూ.30,116 నగదు బహుమతిని అందజేశారు. రన్నర్‌గా నిలిచిన పెదయిర్లపాడు జట్టుకు రూ.20,116, తృతీయస్థానంలో నిలిచిన వెంకుపాలెం జట్టుకు రూ.10,116 నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పువ్వాడి నాగరాజు, నరేంద్ర, నాగార్జున, వెంకట్రావు, ప్రతాప్, మల్లికార్జున, వెంకటేశ్వర్లు, పువ్వాడి సుభాష్ చంద్రబోసు, పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ముండ్లమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను ఆయా గ్రామాల వీఆర్‌వోలు తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, సర్వేయర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రెవెన్యూపరమైన సమస్యల్లో భాగంగా భూముల తేడాలు, సరిహద్దుల వివాదాలు, రికార్డుల్లో తేడాలకు సంబంధించి వచ్చిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపల సమస్యను పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్య ఉంటే ఆర్డీవో, జిల్లా జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్టు చెప్పారు. ప్రతి వీఆర్‌వో తమ పరిధిలోని అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. మరోసారి ఎలాంటి తప్పులు లేకుండా సరి చేయాలన్నారు.

ఈనెలాఖరు కల్లా పూర్తి స్థాయిలో అర్జీలకు పరి ష్కారం చూపాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహ సీల్దార్ ఆర్.శ్రీకాంత్, మండల సర్వేయర్ కోటం రాజు, ఆర్ఐ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు సర్టిఫికెట్‌లు మంజూరుచేసిన వారిపై కేసులు నమోదు చేయాలి

కనిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు సదరన్ సర్టిఫికెట్‌లు మంజూరు చేసిన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రాష్ట్ర దివ్యాంగుల హక్కుల వేదిక నాయకుడు దూళిపాళ్ళ మల్లికార్జునరావు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డబ్బులు తీసుకొని దివ్యాంగులు కాని వారికి సదరన్ సర్టిఫికెట్‌లు మంజూరుచేశారని ఆరోపిం చారు. సదరన్ క్యాంపునకు హాజరైన వైద్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దివ్యాంగుల పెన్షన్ పెంచిందన్నారు. ఇందుకోసం అక్రమ మార్గాల ద్వారా సదరన్ సర్టిఫికెట్‌లు పొందారన్నారు. వికలత్వం 40శాతం ఉంటేనే దివ్యాంగులుగా ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు. 40శాతం లోపు ఉన్నవారికి కూడా సదరన్ క్యాంపు లో వైద్యులు సర్టిఫికెట్‌లు మంజూరు చేశారని పేర్కొన్నారు. దళారులు, వైద్యులు కుమ్మక్కై అనర్హులకు సర్టిఫికెట్‌లు ఇవ్వటంతో అర్హులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. బోగస్ పెన్షన్‌లు తొలగించి అర్హులకు ఫించన్‌లు మంజూరు చేయాలని కోరారు. లేకపోతే న్యాయ పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మిరపలో మెలకువలు పాటించాలి

తాళ్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మిరపపంట కోతకు వచ్చినందున రైతాంగం మెలకువలు పాటించాలని ఏవో బి.ప్రసాదరావు పేర్కొన్నారు. మండలంలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం గ్రామాల్లో గురువారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలో తేజరకం మిరపను మూడువందల ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తుందన్నారు. మంచుకు తడవకుండా కళ్లాల్లో ఆరబోతలో శ్రద్ధ చూపాలన్నారు. పచ్చికాయలు, పక్వానికిరాని కాయలు, పిందెలు, కుళ్లిన కాయలు వేరుచేయాలన్నారు. తద్వార పక్వానికి వచ్చిన కాయలు బాగా ఎండు తాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ అజ్మీర్, సుష్మ సుల్తానా, ఏటీఎం రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై దాడికి యత్నం

కురిచేడు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజుపై బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి యత్నించారు. తమ పార్టీకి చెందిన మరో ఐదుగురితో కలసి ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య కారులో మండలంలోని పడమరనాయుడు పాలెం పంచాయతీ పరిధిలోని పల్లెల యానాది కాలనీలో ఒక వేడుకకు హాజరయ్యారు. అర్ధరాత్రి వరకు వేడుకలో ఉండి రాత్రి 12 గంటల ప్రాం తంలో తిరిగి కురిచేడుకు కారులో బయలుదేరారు. పడమరనాయుడుపాలెం గ్రామం దాటిన తరువాత రెండు ద్విచక్రవాహనాల్లో నలుగురు కారును దాటివెళ్లారు. పడమరనాయుడుపాలెం, ఆవులమంద గ్రామాల మధ్య మరోవ్యక్తితో కలసి ఇనుప రాడ్లతో నాగరాజుపై కారుపై దాడిచేశారు. భయాందోళనకు గురైన నాగరాజు బృందం కారు ఆపకుండా వచ్చారు. పోలీస్ స్టేషన్‌లో ఈమేరకు ఫిర్యాదు చేశారు. గురువారం నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించినట్లు సమాచారం. ఈ విషయమై తెలుగు దేశం పార్టీ వర్గాలు సీరియస్‌గా ఉన్నాయి. మరోసారి ఇలా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




నిర్మాణంలో ఉన్న సిమెంట్ రోడ్డు

సంక్రాంతి కల్లా.. రోడ్లపై గోతులు ఉండవు. ఐదేళ్లుగా గ్రామీణులు దారులు, డ్రెయిన్లు లేక పడిన ఇబ్బందులు పరిష్కరిస్తాం. అని కూటమి ప్రభుత్వం పల్లెపండుగ పనులతో పాటు గోతులు లేని ఆర్‌అండ్‌బీ రోడ్లు అని లక్ష్యం నిర్దేశించుకుంది. అయితే రెండు నెలల క్రితం ప్రభుత్వం ప్రకటించినట్లుగా సంక్రాంతి లక్ష్యం దిశగా ఆరంభంలో ఆయా పనులు సాగాయి. కానీ అధికారుల్లో నిర్లక్ష్యం.. బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో ఇప్పటికి సగం పనులు కూడా పూర్తి కాలేదు. సరైన రోడ్లు, డ్రెయిన్లు లేక గత ఐదేళ్లు ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను సంక్రాంతి నాటికి పరిష్కరించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. గ్రామసభలను నిర్వహించి పల్లెపండుగకు కార్యాచరణ ఇచ్చినా.. ఆర్‌అండ్‌బీ రోడ్లపై గోతులు ఉండకూడదని ప్రత్యేకంగా నిధులు విడుదల చేసినా.. ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంక్రాంతి పండుగ వచ్చింది.. అయినా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో పల్లెపండుగతో పాటు గోతులు లేని రోడ్ల పనులు నత్తే నయం అన్నట్లుగా సాగాయి. ప్రభుత్వం సంక్రాంతి లక్ష్యం నిర్దేశించగా.. అధికారులు ఏ సంక్రాంతి అనుకున్నారో అంటూ ప్రజలు ప్రస్తుతం సాగుతున్న పనులపై వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.

లక్ష్యం.. నిర్లక్ష్యం

ఆర్‌అండ్‌బీ.. మరమత్తు


గుంతలమయంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకి గోతులు లేని రోడ్లు చూడాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకు తగ్గట్లుగా రోడ్లపై గోతులు పూడ్చేందుకు జిల్లాకు రూ.13 కోట్లు పై చిలుకు నిధులు కేటాయించింది. అయినా రోడ్లు, భవనాలు శాఖ అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచారు. సంక్రాంతి నాటికి 100 శాతం పూర్తి కావాల్సిన పనులను కేవలం సగం మాత్రమే పూర్తి చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర రహదారులు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు అధ్వానంగా మారాయి. గోతుల రోడ్లపై వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గోతుల్లో పడి పలువురు మృతి చెందగా వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మారారు. అయినా నాటి పాలకుల్లో రోడ్లపై గుంతలు పూడ్చాలన్న ఆలోచన చేయలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చడంపై దృష్టి సారించింది. ఆయా రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. నిధులను వెంటనే ఖర్చు చేసి రోడ్లు బాగు చెయ్యాలని ప్రభుత్వం ఆదేశించింది. జనవరి 14 నాటికి పూర్తిగా మరమ్మతులు చేపట్టి గుంతలు పూడ్చిన చోట అసిస్టెంట్ ఇంజనీర్లు ఫొటోలు దిగి యాప్‌లో అప్ లోడ్ చెయ్యాలని ప్రభుత్వం నిర్దేశించింది. అయితే అధికారుల్లో నిర్లక్ష్యం కారణంగా సంక్రాంతి పండుగ వెళ్లిపోయినా ఆయా పనుల్లో జాప్యం జరుగుతోంది.

కొందరికే పనులతోనే సమస్య..

గోతుల పనులు త్వరగా పూర్తి కావాలంటే ఎక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించాలి. గుంటూరు జిల్లాలో మాత్రం మొత్తం పనులన్నీ అతి తక్కువ మంది కాంట్రాక్టర్లకు కేటాయించారు. ఒక్కొక్కరికి ఐదారు పనులు కేటాయించారు. ఆ కొద్దిమంది కాంట్రాక్టర్లు అన్ని పనులు సకాలంలో పూర్తి చేయలేక పోయారు. కాంట్రాక్టర్లు ఒక పని ముగిసిన తర్వాత మరో పని మొదలు పెడుతున్నారు. దీంతో ఇప్పటికీ మూడు జిల్లాల పరిధిలో సగం మాత్రమే పనులు పూర్తి అయినట్లు అర్థమవుతోంది.

మేరికపూడి కూలీలు వస్తేనే..

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ పనులన్నీ కేవలం ఫిరంగిపురం మండలంలోని మేరికపూడి కూలీల మీదే ఆధారపడి జరుగుతుంటాయి. వారు లేకపోతే రోడ్ల పనులు జరగడంలేదు. గత నెలలో సెలవులు, పండుగలు ఎక్కువ రావడంతో సదరు కూలీలు పనులకు రాలేదు. దీంతో కూలీల సమస్యతో పనుల్లో జాప్యం నెలకొంది. ఆ గ్రామానికి చెందిన కూలీలు వచ్చే వరకు అన్ని గ్రామాల్లో పనులు ఆగిపోతున్నాయి. పట్టణాల్లో చాలా వరకు రోడ్లు బాగు చేసినా గ్రామాల పరిధిలో ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రత్తిపాడు-గొట్టిపాడు, నల్లపాడు-బైపాస్ తదితర ప్రాంతాల్లో ఇంకా పనులు ప్రారంభమే కాలేదు. ఆయా రోడ్లలో ప్రయాణం ఇప్పటికీ నరకాన్ని తలపిస్తూనే ఉంది.

ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన నిధులు జమ చేస్తోంది. నవంబరు నుంచి ఇప్పటివరకు చేసిన పనుల కు రూ.7 కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమయ్యాయి. సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతున్నా పనులు చేయించడంలో అధికారుల్లో నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి కాని పనులు కేవలం 10 రోజుల్లో (జనవరి 26 నాటికి) పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు.



నెలాఖరులోగా పూర్తి చేస్తాం

రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వం నిధులు కూడా కేటాయించింది. ఆర్‌అండ్‌బీలో కొందరు మాత్రమే కాంట్రాక్టర్లు ఉన్నారు. అందువల్ల పనులు ఆలస్యంగా జరుగుతున్నాయి. దానిని అధిగమించి ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

- సీ విశ్వనాథరెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ, గుంటూరు

నిధులు.. నై

- నిలిచిన పల్లెపండుగ పనులు
- గ్రామాల్లో 43.85 శాతం పనులే పూర్తి
- బిల్లుల చెల్లింపుల్లో నెల రోజులుగా జాప్యం
- నత్తతో పోటీ పడుతోన్న ఆర్‌అండ్‌బీ అధికారులు
- రెండు నెలలుగా 50 శాతం గోతులనే పూడ్చారు
- జిల్లాకు రూ.13 కోట్లు నిధులిచ్చినా పనుల్లో నీరసమే

జిల్లా	చేపట్టిన పనులు	పూర్తిచేసిన పనులు	పనుల శాతం
పల్నాడు	521	238	45.68
బాపట్ల	640	298	45.57
గుంటూరు	167	69	40.35

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో రెండు నెలల క్రితం పల్లె పండుగలో భాగంగా ఉపాధి హామీ పథకంలో చేపట్టిన రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించినట్లుగా పల్లె పండుగ పనులు సంక్రాంతి పండుగకు పూర్తి కాలేదు. పూర్తైన పనులకు నెలరోజులుగా బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి. రూ.కోట్లల్లో బిల్లులు చెల్లింపులు నిలిచిపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పథకం ప్రారంభంలో వారం.. వారం బిల్లుల చెల్లింపులు జరగడంతో పనులు వేగంగా జరిగాయి. రెండు వారాల తర్వాత బిల్లుల చెల్లింపులు జరగక ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి.

నాడు ప్రభుత్వం.. నేడు అధికారుల నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. కనీసం రోడ్లు, మురుగుకాల్వలు వంటి మౌలిక సదుపాయలు కల్పించలేదు. దీంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల అభివృద్ధిపై దృష్టిసారించింది. సత్వరం చేపట్టాల్సిన పనులను గ్రామసభల ద్వారా గుర్తించి పంచాయతీ తీర్మానాల ద్వారా ప్రతిపాదనలను అధి కారులు రూపొందించారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా మార్చే పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు నిర్దేశించింది. అయితే చేపట్టిన పనుల్లో సగం కూడా పూర్తి కాలేదు. పనులను కాంట్రాక్టుపై కాకుండా నామినేషన్ విధానంలో చేస్తున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ సూచించిన వ్యక్తుల చేత పనులు చేపట్టారు. కాగా పనులకు సంబంధించిన బిల్లులను అప్‌లోడ్ చేశామని పల్నాడు జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి తెలిపారు. త్వరలోనే బిల్లుల చెల్లింపు జరిగే అవకాశం ఉందని చెప్పారు.

సగం పనులే పూర్తి..

గుంటూరు జిల్లాలో 132 కిలోమీటర్ల మేర రాష్ట్ర రహదారుల బాగుకు రూ.487.90 లక్షలు, 420.467 కిలోమీటర్ల మేర మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల బాగుకు రూ.848.90 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. అయితే ఇప్పటికి మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 175 కిలోమీటర్లు, రాష్ట్ర రహదారులు 72 కిలోమీటర్లు మాత్రమే బాగు చేశారు. ఇంకా సగం పనులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆర్‌అండ్‌బీ లెక్కలు చెప్తున్నాయి. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పల్లెపండుగలో భాగంగా చేపట్టిన పనుల్లో ఇప్పటికి 43.85 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు డ్వామా శాఖ గణాంకాలు చెబుతున్నాయి.


నిర్మాణంలో ఉన్న మురుగు కాల్వలు



పల్లెల్లో పనులు ఇలా..

- పల్నాడు జిల్లాలో రూ.62.54 కోట్లతో గ్రామాల్లో రహదారులు, మురుగు కాల్వలు, ప్రభుత్వ పాఠశాలల ప్రహరీల నిర్మాణ పనులు చేపట్టారు. 521 పనులు చేపట్టగా ఇప్పటికి 238 పనులు మాత్రమే పూర్తి చేశారు. 70,436 మీటర్ల మేర రోడ్లు, 9,118 మీటర్లలో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టారు.
- బాపట్ల జిల్లాలో 640 పనులను రూ.67.58 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 298 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 1,20,964 మీటర్ల మేర రోడ్లు, 1,176 మీటర్ల మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు.
- గుంటూరు జిల్లాలో 167 పనులను రూ.14.54 కోట్లతో చేపట్టగా ఇప్పటికి 69 పనులు మాత్రమే పూర్తయ్యాయి. 26,754 మీటర్ల రోడ్ల నిర్మాణం చేపట్టారు.


నిర్మాణ దశలో సీసీ రోడ్డు

ఏఎన్‌యూ పీజీ పరీక్షల తేదీల్లో మార్పులు

- 1, 3 సెమిస్టర్ పరీక్షలకు మారిన షెడ్యూల్

పెదకాకాని, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ, ప్రొఫెషనల్ కోర్సులకు నిర్వహించే పరీక్షల తేదీల్లో మార్పులు చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు గురువారం తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఆర్ట్స్ కోర్సులు, సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ కోర్సులకు మూడో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21నుంచి ప్రారంభం కావాల్సి ఉండగా, ఫిబ్రవరి 11వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. ఈ నెల 27నుంచి జరగాల్సిన 1వ సెమిస్టర్ ఆర్ట్స్ సైన్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఈడీ పరీక్షలు ఫిబ్రవరి 13వ తేదీ నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లుచేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలు ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయన్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ తేదీల్లో యూజీసీ నెట్ పరీక్ష ఉండటంతో వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాల మేరకు మూడో సెమిస్టర్ పరీక్షల తేదీల్లో మార్పులు చేశామని వివరించారు.

పోటాపోటీగా ఎడ్ల బల ప్రదర్శన

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంబొట్లవారిపాలెంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. గొట్టిపాటి హనుమంతురావు మెమోరియల్ ప్రాంగణంలో గురువారం న్యూకేటగిరి(సేద్యపు) విభాగంలో, గోరంట్ల రత్తయ్యచౌదరి ప్రాంగణంలో పోలురాధా ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరిగాయి. సేద్యపు విభాగంలో 11 జతల ఎడ్లు తలపడ్డాయి. పల్నాడు జిల్లా ఉయ్యాలవారి పాలేనికి చెందిన వీరబ్రహ్మం ఎడ్లు, గుంటూరు జిల్లా పెద్దగొట్టిపాడుకు చెందిన జి.లక్ష్మయ్య చౌదరి ఎడ్లు, కృష్ణా జిల్లా గంగవరానికి చెందిన శ్రీనివాసయాదవ్ ఎడ్లు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

నేటితో ముగియనున్న పోటీలు

పాలపళ్ల విభాగంలో శుక్రవారం జరిగే పోటీలతో కార్యక్రమం ముగుస్తుందని నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. 6-8 పళ్ల విభాగంలో ఆవులకు అందాల పోటీలు నిర్వహిస్తామన్నారు.


జాతీయ స్థాయి పోటీల్లో తలపడుతున్న ఒంగోలు జాతి గిత్తలు

గౌరవం సరే.. వేతనం?



- గౌరవ వేతనం కోసం సర్పంచ్‌ల నిరీక్షణ
- నెలకు రూ.3 వేలు.. పది నెలలుగా పెండింగ్
- ముఖ్యమంత్రి ఆదేశాలను పట్టించుకోని అధికారులు

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కడుపు చించుకుంటే కాళ్ల మీద పడినట్లుగా ప్రస్తుతం సర్పంచ్‌ల పరిస్థితి నెలకొంది. గత పది నెలలుగా గౌరవ వేతనం అందక గ్రామాల్లోని ప్రథమ పౌరులైన సర్పంచ్‌లు అల్లాడిపోతున్నారు. కూటమి ప్రభుత్వంలో తగిన గౌరవం దక్కుతుందన్న ఆనందం.. వేతనం అందలేదన్న బాధతో ఆవిరి అవుతుందని వాపోతున్నారు. తమ దగ్గర పనిచేసే ఉద్యోగులకు జీతాలు అందకపోతే వారితో, వీరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నాం.. అదే తమకే వేతనం రాకపోతే ఎవరికి చెప్పుకోవాలని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి గౌరవం వేతనం బకాయి ఉంది. గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519, బాపట్ల జిల్లాలో 426 మంది సర్పంచ్‌లు ఉన్నారు. వారికి నెలకు ప్రభుత్వం గౌరవ వేతనం కింద రూ.3 వేల వరకు చెల్లిస్తుంది. గత ప్రభుత్వం ఈ మొత్తం చెల్లించేందుకు కూడా సర్పంచ్‌లను ముప్పతిప్పలు పెట్టిం ది. దానికోసం సర్పంచ్‌లు పలు సందర్భాల్లో రోడ్డెక్కాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో సర్పంచ్‌లు దూరం అవుతారన్న ఆలోచనతో అప్పటి వరకు ఉన్న బకాయిలను గత ఏడాది మార్చి నెలలో వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో వేతనాలు చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పరిపాలనా సంబంధిత వ్యవహారాల్లో సర్పంచ్‌లను కీలకమైన వారిగా ప్రకటించింది. గౌరవ వేతనం చెల్లింపులపై సీఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయినా చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. చాలామంది సర్పంచ్‌ల రోజువారీ ఖర్చులకు ఆ గౌరవ వేతనమే ఆధారమని చెబుతున్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

యద్దనపూడి (మార్టూరు), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరంలో రెండో రోజు గురువారం ఎన్టీఆర్ కళాపరిషత్ తృతీయ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలలో భాగంగా ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను ఆలోచింపచేశాయి. మైత్రి కళానిలయం విజయవాడ వారు బ్రహ్మ స్వరూపం నాటికను ప్రదర్శించారు. ఆలోచనలు, ప్రవర్తన, మంచిగా ఉంటే ప్రపంచమంతా మంచిగా కనిపిస్తుందనే ఇతివృత్తంతో కళాకారులు ప్రదర్శించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకున్నది. యంగ్ థియేటర్ విజయవాడ వారు 27వ మైలు రాయి నాటికను ప్రదర్శించారు. కోర్టులో న్యాయవాదులు సమాజానికి కీడు చేసే కేసులు వాదించకుండా ఉండడం ఉత్తమం అనే అంశాన్ని ఇతివృత్తంతో ప్రదర్శించారు. వెలగలేరు థియేటర్ ఆర్ట్స్ వారు నిశి నాటికను ప్రదర్శించారు. కోరికలను తీర్చుకోవడానికి ఒక్కోసారి తప్పులు చేయడం, మరలా ఆ తప్పులను సరిచేసుకోవడానికి మరిన్ని అబద్ధాలు చెప్పడం, తద్వారా తన జీవితాన్ని తానే నాశనం చేసుకోవడం తదనంతరం కలిగే పరిణామాలు ఇతివృత్తంగా నాటికను ప్రదర్శించారు.

నేటి ప్రదర్శనలు

శుక్రవారం రాత్రి యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే నా శత్రువు, స్నేహ ఆర్ట్స్ విజనంపాడు వారిచే కొండంత అండ, చివరగా శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారిచే ఏది నిజం నాటికను ప్రదర్శిస్తారు.


బ్రహ్మస్వరూపం నాటికలోని భాగం

ధర.. దిగాలు



- మిర్చి క్వింటాల్ రూ.13 వేలు
- ఏడాదిగా మిర్చి ధరలు పతనం
- దిగుబడులున్నా పెట్టుబడి రాని దుస్థితి
- ఇప్పటికే కోల్డ్ స్టోరేజ్‌ల్లో లక్షల టిక్కీల నిల్వ
- 20వ తేదీ నుంచి యార్డులో కొనుగోళ్లు ప్రారంభం

గుంటూరు సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మిర్చి ఘాటు ధరలో లోపించింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా ధరలు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఏడాదిగా మిర్చి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు దిగాలుగా ఉన్నారు. ఒకప్పుడు మిర్చి పండించి లాభాలు గడించిన రైతులు ఆ సాగును వీడలేక.. ఎప్పటికైనా ధర పెరగకపోతుందా అని ఎదురుచూస్తున్నారు. అయితే ఏడాదిగా పరిస్థితిలో మార్పు రాకపోగా మరింతగా ధరలు దిగజారిపోతున్నాయి. గత ఏడాది జనవరి నుంచి ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాధారణంగా సీజన్ ఆరంభంలో మంచి ధర పలికే ఆనవాయితీ కూడా ఈసారి తప్పింది. ఎగుమతి ఆర్డర్లు తగ్గడం, ఆయా రాష్ట్రాల్లో కూడా వెరైటీలు బాగా పండడంతో మిర్చి ధర పతనం అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది గుంటూరు మిర్చి యార్డుకు తెచ్చిన పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు లక్షలాది టిక్కీలు కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేశారు. ఏడాది పొడవునా ఒకే ధర ఉండడంతో వాటిని మధ్యలో అమ్మే ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలో సోమవారం నుంచి గుంటూరు మిర్చి యార్డులో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ ఒక్కరోజే సుమారు 80 వేల టిక్కీలు అమ్మకానికి వస్తాయని యార్డు అధికారులు అంచనా వేస్తున్నారు. పాత పంట లక్షల టిక్కీలు పేరుకుని పోతే, కొత్త పంట ధర విషయంలో పెద్దగా డిమాండ్ ఉండకపోవచ్చని వ్యాపారులు అంటున్నారు. గుంటూరు మిర్చి యార్డులో ప్రస్తుతం కామన్ వెరైటీగా చెప్పే 334, నెంబరు 5,273, గుంటూరు సన్నం, సూపర్ 10,341 కనిష్ఠ ధర రూ.7 వేలు, గరిష్ఠ ధర రూ.19 వేలు ఉంది. అయితే రూ.13 వేలకు మించి కొనుగోలు జరగడం లేదు. స్పెషల్ వెరైటీగా చెప్పబడే తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ కనిష్ఠ ధర రూ.7500, గరిష్ఠ ధర రూ.20700 ఉండగా రూ.15 వేలకు మించి కొనుగోలు జరగడం లేదని సమాచారం.

తగ్గిన సాగు.. పెరిగిన పెట్టుబడి

గత ఏడాది పెద్దగా మిర్చికి ధర లేకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది మిర్చి

(మిగతా 8వ పేజీలో)

గుండ్లకమ్మ ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

- మంత్రి ఆదేశించినా కఠిన చర్యలపై అధికారుల ఉదాసీనత
- ఆక్రమణదారుల వసూళ్లు
- ప్రజలకు తప్పని ఇసుక భారం

అద్దంకి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇసుక తవ్వకాల విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తే సహించేది లేదు... అదే సమయంలో ఇసుకను ప్రజలకు అందకుండా అడ్డంకులు సృష్టించి ఎక్కువ ధరకు అమ్మకాలు చేస్తే అసలు ఒప్పుకునేది లేదని.. గుండ్లకమ్మ బ్రిడ్జి, ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా... ప్రత్యేకంగా గుర్తించిన ప్రాంతాలలో మా త్రమే ఇసుక తవ్వకాలు జరిగేల ని, పగలు సమయంలో మా త్రమే ఇసుక తరలించే విధంగా చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఇటీవల అద్దంకి లో జరిగిన రెవెన్యూ సదస్సు లో ఆయా శాఖల అధికారులకు విద్యుత్‌శాఖ మం త్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అయితే అప్పుడు ఒకింత హడావుడి చేసిన అధికారులు ఆ తరువాత మరలా షరా మాములు గా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గుండ్ల కమ్మ నదిలో బ్రిడ్జి వద్ద మరలా గత నాలుగైదు రోజులుగా ఇసుక తవ్వకాలు ప్రారంభమయ్యాయి. అధికారులు ఉదాసీనత వల్లనే ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.



గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జి వద్ద జరిగిన ఇసుక తవ్వకాలతో ఏర్పడ్డ గోతులు

ప్రజలకు ఇసుక కష్టాలు

గుండ్లకమ్మ నదిని ఆక్రమించి సాగు చేసుకుంటున్న కొందరు వ్యక్తులు అదే భూమిలో ఇసుక ను అ మ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ఆ భారం ప్రజలపై పడుతుంది. గుండ్ల కమ్మ నది ని ఆ క్రమించి ఇటీవల వరకు పంటలు సాగు చేశారు. వరద వచ్చిన సమయంలో మునిగిపోవడం, మిగిలిన సమయంలో పశు గ్రాసం, వరి సాగు జరిగేది. అయితే అదే ఆ క్రమిత భూమి ని ఇప్పుడు ఆక్రమణదారులు ఇసుక అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎకరా 5 నుంచి 10 లక్షల రూపాయల కు అమ్ముకుంటున్నారు. లేదా ఒక్కో ట్రాక్టర్ కు 700 నుండి వెయ్యి రూపాయలు చొప్పున వసూ లు చేస్తున్నారు. దీం తో ట్రాక్టర్ ఇసుక అద్దంకి పట్టణం కు చేరేందుకు 2200 రూపాయలు గా ఉంది. ప్రభుత్వ భూమిగా ఉన్న గుండ్లకమ్మ నదిలో ఇసు కకు ఆ క్రమణదారులు డబ్బులు వసూలు చేయ డం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇసుకకు డబ్బులు చెల్లింపు లేకపోతే 1500 రూపాయలకే అద్దంకి పట్టణంలోకి ఇసుక చేరుతుంది. ఇప్పటికైనా గుండ్లకమ్మ నది సర్వే చేపట్టి హద్దులు నిర్ధారించినందున ఆయా ప్రాంతాలలో ఇసుక కు ఎ లాంటి డబ్బులు చెల్లించకుండా అధికారులు చర్య లు చేపడితే తక్కువ కే ఇసుక లభ్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు అభి ప్రాయపడుతున్నారు. అధికారులు స్పందించి గుండ్లకమ్మ బ్రిడ్జి, ఊటబావుల వద్ద ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టడం తో పాటు ఇసుక తవ్వకాలకు ఆ క్రమణదారులు డబ్బులు వసూలు చేయకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



ఇసుక తవ్వకాల పక్కనే నదిని ఆక్రమించి సాగు చేసిన పైరు



కొణిదెనలో దివ్యాంగురాలిని తనిఖీ చేస్తున్న వైద్య బృందం

దివ్యాంగులను తనిఖీ చేసిన వైద్య బృందం

బల్లికురవ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలలో బోగస్ పింఛన్‌లను ఏరి వేసేందుకు అధికారులు తనిఖీలను ప్రారంభించారు. మండలంలో కదలలేని స్థితిలో మంచంపై ఉండి రూ.15వేల పింఛన్ పొందుతున్న దివ్యాంగులను గురువారం గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆధ్వర్యంలో గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం తనిఖీలు చేశారు. మండలంలోని కొణిదెన, బల్లికురవ, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, కొప్పెరపాలెం, కొత్తూరు, నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు, వల్లాపల్లి, వేమవరం, వైదన గ్రామాలలో పింఛన్‌లు పొందుతున్న 24 మందిని పరిశీలించి వారి వద్ద ఉన్న వివరాలను సేకరించి వారు పూర్తి వైకల్యంతో ఉన్నారా లేదా అని తనిఖీలు చేశారు. పరిశీలన అనంతరం నివేదికను జిల్లా అధికార్లకు అందజేస్తామని వైద్య బృందం తెలిపింది. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణ రిక్షాల కొనుగోలు

మార్టూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మార్టూరు గ్రామ పంచాయతీ రూ.3లక్షల వ్యయంతో 6 చెత్త సేకరణ రిక్షాలను కొనుగోలు చేసింది. గ్రామంలోని వీధులు, ఇళ్ల నుంచి చెత్త సేకరణ కోసం పంచాయతీ కింద ట్రాక్టర్లు, ఆటోటు ఉన్నాయి. అయితే చిన్న రోడ్లు, ఇరుకుదారుల గుండా వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో చిన్న రిక్షాలను కొనుగోలు చేశారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు సక్రంగా చేయాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించిన నేపథ్యంలో చెత్త రిక్షాలను కొనుగోలు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

సెల్ టవర్ ఫిర్యాదుపై తనిఖీ

ఇంకొల్లు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయం వెనుక సెల్ టవర్ ఏర్పాటుపై గ్రామానికి చెందిన వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు ఇవ్వడంతో డీఎల్‌పీవో బి.శివన్నారాయణ గురువారం తనిఖీ చేశారు. 2018లో సెల్ టవర్‌కు అనుమతులు ఏ విధంగా ఇచ్చినది, గ్రామ పంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు మోహన్‌బాబు, కోటి నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



ర్యాలీ చేస్తున్న అధికారులు

బల్లికురవ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : రీసర్వేతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ రవి నాయక్ అన్నారు. గురువా రం మండలంలోని అంబడిపూడి గ్రామంలో చేపడుతున్న భూ సర్వేపై రైతులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతు రైతులందరూ సర్వేకు సహకరించాలన్నారు. రీసర్వే జరిగే ప్రాంతాలకు రైతులు వెళ్లి తమ భూములకు తమ వద్ద ఉన్న హక్కు పత్రాలను వారికి చూపించాలన్నారు. సర్వే ద్వారా ప్రభుత్వ భూముల వివరాలను కూడా సేకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, సర్వే డీటీ ప్రహర్ష, అర్‌ఐ పోతురాజు, సిబ్బంది పాల్గొన్నారు.



నాయుడుగోపిని సత్కరిస్తున్న గుంటూరు కళా పరిషత్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, పాండురంగారావు

తెలుగు నాటక రంగాన్ని బతికించుకోవాలి

యద్దనపూడి, (మార్టూరు) జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు నాటక రంగాన్ని బతికించుకోవాలి, కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సినీ, టీవీ నటుడు, దర్శకుడు నాయుడు గోపి అన్నారు. యద్దనపూడి మండలం అనంతవరంలో రెండవ రోజు జరిగిన ఎన్టీఆర్ కళా పరిషత్ నాటిక పోటీలకు నాయుడు గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు అధ్యక్షతన జరిగిన సభలో గోపీ మాట్లాడుతూ కళాపరిషత్‌లు ఉండడం ద్వారానే నాటక రంగం ఉందన్నారు. బావితరాలు వారికి మన సంస్కృతి సంప్రదాయాలు తెలియజేసే అవకాశం ఈ రంగానికి ఉందన్నారు. అనంతరం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంటూరు కళాపరిషత్ అధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు, ముత్తవరపు సురేష్‌బాబు, కందిమళ్ల సాంబశివరావు గుదే తారకరామారావు, కొరటాల వంశీ, ఈశ్వర్‌ప్రసాద్, సాంబశివరావు, జయరామకృష్ణ పాల్గొన్నారు.

కాండం తొలుచు పురుగుతో జాగ్రత్త

అద్దంకిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరి పైరులో కాండం తొలుచు పురుగు పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని వెంపరాల, చక్రాయపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో సాగు చేస్తున్న వరి పైరును ఏవో వెంకటకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన వరి పంటలో కాండం తొలుచు పురుగును గుర్తించామన్నారు. కార్యక్రమంలో వీఏఏ శేషయ్య, గ్రామస్థులు సురేష్, రైతులు పాల్గొన్నారు.

పంగులూరు : భూసార పరీక్షల ఆధారంగా పంట సాగు చేపడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. ఆరికట్లవారిపాలెం, రేణంగివరం గ్రామాలలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవాకేంద్రం సిబ్బంది అలగ్జాండర్, శివాని పాల్గొన్నారు.

బల్లికురవ : మొక్కజొన్న సాగులో కత్తెర పురుగు ఉధృతి ఉందని, అప్రమత్తంగా ఉండి నివారణ చర్యలు తీసుకోవాలని ఏవో కుమారి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొత్తూరు, వెలమవారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని తెలిపారు.

దివ్యాంగులకు ఉచిత పరికరాలు

చినగంజాం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, వీల్‌చైర్స్, చేతికర్రలు, నడుంబెల్టు, మెడ బెల్టు, ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను ఉచితంగా అందజేయనున్నట్లు మండల దివ్యాంగుల సమాఖ్య సభ్యులు మార్పు విశ్రాంతమ్మ, కుర్మాల సురేష్‌బాబు, వి.వేణుబాబు, మెడబలిమి చిట్టిబాబు, ములుగు హనుమంతరావులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అర్హత కలిగిన దివ్యాంగులు దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వినికిడి యంత్రాలు, వీల్ చైర్, స్టిక్ (చేతికర్ర), నడుము బెల్ట్ తదితర వస్తువులకు 60 సంవత్సరాల వయస్సు దాటిన వారికి ఆధార్, రేషన్ కార్డులు, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఫోన్ నెంబరు, 60 సంవత్సరాలలోపు ఉన్నవారకి దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఆధార్, రేషన్ కార్డులు, ఫొటో, ఫోను నెంబరు కావాలని తెలిపారు. మెడ బెల్ట్‌కు వయస్సు పరిమితి లేదని, ఆధార్, రేషన్ కార్డు, ఫోటో, ఫోను నెంబరు తీసుకుని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9989348332 సెల్ నెంబరును సంప్రదించాలని తెలిపారు.

ధర.. దిగాలు

(5వ పేజీ తరువాయి)

సాగు తగ్గింది. గత ఏడాది 2,37,398 హెక్టార్లలో మిర్చి సాగు కాగా, ఈ ఏడాది కేవలం 1,45,713 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. కొన్ని తెగుళ్ల వచ్చినప్పటికీ ప్రస్తుతం పంట బాగానే ఉన్నది. దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. మిర్చి సాగు పెట్టుబడి ఏటేటా పెరుగుతూనే ఉంది. ఈ ఏడాది ఎకరాకు రూ.2 లక్షల నుంచి రూ.2.30 లక్షలు పెట్టుబడి అవుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 20 క్వింటాల్ దిగుబడి వస్తుందన్న అంచనాలో రైతులు ఉన్నారు. పూర్తిస్థాయిలో పంట చేతికి వచ్చేప్పటికి ఇదే ధరలు కొనసాగినా రైతులకు పెద్ద నష్టం వాటిల్లదు. కానీ ఒక వేళ ధరలు మరింత పతనమైతే మాత్రం ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు నష్టం వస్తుందన్న అంచనాలున్నాయి.

తెలంగాణలోనూ సాగు

అనేక దేశాల్లో మిర్చి పండుతున్నా గుంటూరు జిల్లాలో పండించే తేజ వెరైటీకే ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ ఉంటోంది. ఘాటు ఎక్కువగా ఇష్టపడే ముస్లిం దేశాలకు, దక్షిణ చైనాకి గుంటూరు మిర్చి ఎగుమతి అవుతుంది. గుంటూరు జిల్లాలో పండిస్తున్న తేజ వెరైటీలో ఘాటు 70 వేల నుంచి 80 వేల యూనిట్స్ వరకు ఉంటుంది. ఈ రకం ఎక్కువగా పండించేందుకు ఈ నేల అనువుగా ఉండటంతో దిగుబడి కూడా ఎక్కువగా వచ్చేది. అయితే మూడు, నాలుగేళ్లుగా ఇదే పంటను తెలంగాణలో కూడా ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఖమ్మం, మధిర ప్రాంతాల్లో పండుతున్న మిర్చిని ఎక్కువగా బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేస్తున్నారు. దీంతో గుంటూరు యార్డు నుంచి ఆర్డర్లు తగ్గాయి. అదీకాక అంతర్జాతీయగా కూడా మిర్చి సాగు పెరిగిందని ఈ క్రమంలో ధరలు పతనమవుతున్నట్లు తెలుస్తోంది.

మెరుగైన సేవలందించాలి

ఎమ్మెల్యే కొండయ్య



రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : శాఖ ఏదైనా సంబంధిత అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలి. తద్వారా మెప్పు పొందుతూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. ఆయన ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడుతో కలసి నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ పేదలకు నివేశన స్థలాలు పంపిణీ చేసేందుకు నియోజకవర్గ పరిధిలో ఉన్న వనరులపై చర్చించారు. అందుకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. పొజిషన్ సర్టిఫికెట్లకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణతో ఎని చేయాలన్నారు. సబ్‌ప్లాన్‌కు సంబంధించి అర్హులైన వారికి కులధ్రువీకరణ పత్రాలు నిర్ణీత కాలవ్యవధిలో మంజూరు చేయాలని చెప్పారు. అక్రమ ఇసుక, అనధికారిక లేఅవుట్లకు సంబంధించి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఏమన్నా ఆటంకాలు ఎదురైతే ప్రభుత్వపరంగా అండగా ఉంటామని చెప్పారు.

కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, చీరాల, వేటపాలెం మండలా తహసీల్దార్లు గోపికృష్ణ, పార్వతి, మెప్మా సీఎంఎం కొండయ్య పాల్గొన్నారు.

సీఐగా సుబ్బరాజు బాధ్యతలు

ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తా



సీఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బరాజు

అద్దంకి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిస్తామని అద్దంకి టౌన్ సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి టౌన్ సీఐగా సుబ్బరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ అద్దం కి పట్టణంలో ట్రాఫిక్ బాగా పెరిగినందున పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. చిన్నపిల్లలకు ఎట్టి పరిస్థితులలో తల్లిదండ్రులు మోటార్‌సైకిళ్లను ఇవ్వరాదన్నారు. ద్విచక్రవాహన చోదకులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. గంజాయి సేవించినా, అమ్మకాలు చేసినా ఉపేక్షించేది లేదన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనైతే కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. అద్దంకిలో దొంగతనాలు జరగకుండా నివారించేందుకు గస్తీ మరింత పెంచడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరించటం జరుగుతుందన్నారు. ముందుగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో సీఐ సుబ్బరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుబ్బరాజు అద్దంకి సిఐ గా 2017 నుంచి 2019 వరకు రెండు సంవత్సరాల పాటు ఎస్సైగా విధులు నిర్వహించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ సుబ్బరాజును ఎస్సై ఖాదర్‌బాషా, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

18న సర్వసభ్య సమావేశం

పంగులూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కె.స్వరూపారాణి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనవలసిందిగా కోరారు.



ద్రోణాదుల చెరువులో స్వామి వారి తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కనులపండువగా తెప్పోత్సవం



విద్యుత్ ప్రభ

మార్టూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గురువారం సంక్రాంతి సందడి ఏర్పడింది. కనుమ పండుగ మరుసటి రోజు పండుగ వాతావరణ నెలకొంటుంది. గ్రామస్థులు కోదండరామ స్వామి, సోమేశ్వరస్వామి, ఆం జనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను మచ్చాడిగుంట చెరువులో ప్రత్యేకంగా అలంకరించిన కర్రల పందిరిపై తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకించడానికి గ్రామస్థులు భారీగా చెరువు వద్దకు తరలివచ్చారు. రాత్రికి స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో విద్యుత్ దీపాలంకరణ చేసి,ప్రత్యేకంగా అలంకరణతో భారీగా విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు.అంతేగాకుండా రాత్రి కోలాట ప్రదర్శనతో పాటు పాటకచేరీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామ స్థులందరూ ఐక్యంగా కార్యక్రమాలలో పాల్గొన్నారు. సీఐ ఎం.శేషగిరిరావు ఆధ్వర్యంలో యద్దనపూడి ఎస్‌ఐ రత్నకుమారి, ఏఎస్‌ఐ బాషా, మార్టూరు,బల్లికురవ, సంతమాగులూరు పోలీసులతో బందోబస్తు ఏర్పాటుచేశారు.

భార్యపై కత్తిపీటతో దాడి కేసులో .. భర్తకు జైలు

చీరాలటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : భార్యను కత్తి పీటతో దాడిచేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన కేసులో భర్తకు 18 నెలలు జైలు శిక్షను విధిస్తూ చీరాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ తీర్పును ఇచ్చారు. మండల పరిధిలోని గవినివారిపాలెంకు చెందిన పిట్టు సుబ్బారావు, భార్య కుమారికి కలతలు చోటుచేసుకున్నాయి. 2002లో కత్తిపీటతో ఆమెపై దాడి చేశాడు. ఈమేరకు ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదయిన కేసులో వాదోపవాదనల అనంతరం గురువారం న్యాయాధికారి 18 నెలలు జైలు శిక్ష విధించారు.

మంచు కురిసే వేళలో

పొగమంచు దట్టంగా ఆవరించింది. పక్షం రోజుల కిందట దట్టంగా ఉన్న మంచు గత కొద్ది రోజులుగా కొంత మేర తగ్గగా గురువారం దట్టంగా పట్టింది. వేకువజాము నుంచి ప్రారంభమైన మంచు ఉదయం 9 గంటల వరకు కూడా వదలలేదు. దీంతో వాహనచోదకులు లైట్లు వేసుకొని నిదానంగా ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు, ద్విచక్ర వాహనచోదకులు కూడా ఇబ్బంది పడ్డారు. సాధారణ ప్రజలు కూడా పొగ మంచుతో ఇబ్బంది పడ్డారు.

- అద్దంకి (ఆంధ్రజ్యోతి)



పట్టణంలోని నామ్ రోడ్డుపై దట్టంగా ఉన్న మంచు



రామ్‌నగర్‌లో లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్న వాహనచోదకులు

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



రవిచంద్రన్

మార్టూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : చెన్నై నుంచి విజయవాడ వెళుతున్న లారీలో అదనపు డ్రైవర్ ఎం. రవిచంద్రన్ (39) గుండెపోటుతో మృతిచెందిన సంఘటన గురువారం బొల్లాపల్లి టోల్ ప్లాజా సమీపంలో జరిగింది. అందుకు సంబందించిన వివరాలిలావున్నాయి. విజయవాడ వెళుతున్న లారీ ని ఒక డ్రైవరు నడుపుతుండగా, మరో డ్రైవరు రవిచంద్రన్ క్యాబిన్‌లో నిద్రపోతున్నా డు. టోల్‌ప్లాజా వద్దకు వచ్చిన తర్వాత రవిచంద్రన్ ఎలాంటి కదలిక లేని విషయాన్ని డ్రైవర్ చూశాడు. 108కి సమాచారం ఇవ్వగా వా రు వచ్చి రవిచంద్రన్‌ను పరిశీలించి చనిపోయినట్లు తెలిపా రు. అనంతరం ఈ విషయా న్ని చెన్నైలోని బంధువులకు స మాచారం అందించారు. ప్రైవే టు అంబులెన్స్‌లో మృతదేహా న్ని చెన్నైకు పంపించారు. దీని పై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



కొలువుతీరిన దేవతామూర్తులు



ఏటి పండుగకు తరలివచ్చిన నగర వాసులు





మహిళల ఆటపాటలు, కోలాటం



గొబ్బిపాటలు పాడుతున్న ముత్తైదువలు



పెన్నాలో భక్తి ప్రవాహం

- కోలాహలంగా ఏటి పండుగ
- భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల నిమజ్జనం
- కొలువుదీరిన దేవతామూర్తులు
- అలరించిన నృత్యాలు, పతంగుల ఎగురవేత
- కిటకిటలాడిన పినాకినీ తీరం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో చివరి పండుగయిన ఏటి పండుగ పెన్నానది తీరంలో గురువారం రాత్రి కోలాహలంగా జరిగింది. అటు పవిత్ర పినాకినీ తీరం.. ఇటు గొబ్బెమ్మల నిమజ్జనం.. మరోవైపు ఇసుకేస్తే రాలనంత జనంతో పెన్నాతీరం కిటకిటలాడింది. కుల మతాలకు అతీతంగా చిన్నా పెద్దా అంతా కుటుంబాలతో కలిసి వచ్చి ఈ వేడుకలో పాల్గొన్నారు. వివిధ రంగుల్లో విభిన్న ఆకృతులతో పతంగులు ఆకాశంలో సందడి చేశాయి. వీటిని ఎగురవేయడంలో చిన్నారులు, యువకులు పోటీపడ్డారు. యువత కేరింతలు, ఈలలు, పాటలు, క్రీడలు, గుర్రపు స్వారీలు, రంగుల రాట్నాలతో ఏటి పండుగ ఆహ్లాదకరంగా సాగింది.



ఏటి పండుగలో పాల్గొని పిండివంటలు ఆరగిస్తున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

● కొలువుదీరిన దేవతామూర్తులు

భక్తులను ఆశీర్వదించేందుకు జిల్లాలోని నలుమూలల నుంచి దేవతామూర్తులు సర్వాభరణాలు, విశేష అలంకారాలతో వచ్చి కొలువుదీరారు. జొన్నవాడ మల్లికార్జున, కామాక్షితాయి, నెల్లూరు రాజరాజేశ్వరమ్మ, నర్రవాడ వెంగమాంబ, నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి, తల్పగిరి రంగనాథస్వామి తదితరులు ఉభయదేవేరులతో తరలివచ్చారు. వీరేకాక మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, మూలస్థానేశ్వరస్వామి, శ్రీకృష్ణధర్మరాజులస్వామి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి తదితరులు కూడా కొలువుదీరారు. కార్యక్రమాలను జిల్లా దేవదాయ సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈవోలు అర్వభూమి శ్రీనివాసరెడ్డి, గిరికృష్ణ, ఇన్‌స్పెక్టర్లు ఆర్.చైతన్య, సుధీర్, వేమూరి గోపి తదితరులు పర్యవేక్షించారు.

● భక్తిశ్రద్ధలతో గొబ్బెమ్మల ఓలలాడింపు

సంక్రాంతి సంబరాల్లో భోగి నుంచి కనుమ పండుగ వరకు మహిళలు, యువతులు, గొబ్బెమ్మ(గౌరీ) మహాశివుడి ప్రతిమలను మట్టితో తయారు చేసి గొబ్బినోములు నోచారు. నాలుగోరోజు గొబ్బెమ్మలను పెన్నా జలాల్లో ఓలలాలింపు (నిమజ్జనం) చేసేందుకు ముత్తైదువులు, యువతులు తరలివచ్చారు. సంప్రదాయ, వస్త్రాలు ధరించి పెన్నానది తీరంలో గొబ్బెమ్మలకు పూజలు చేశారు. అనంతరం పాటలు పాడుతూ పెన్నలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువతీ,యువకులు కబడ్డీ, చెమ్మచెక్క, కళ్లకుకంతలు కట్టుకుని దాగుడుమూతలు ఇతర ఆటలతో సందడి చేశారు. బూరలు ఊదుతూ యువకులు సందడి చేశారు.

● సందడి చేసిన ఏడు కుటుంబాలు

నెల్లూరు చెందినవారు ఉద్యోగం, వ్యాపారం రీత్యా బయట రాష్ట్రాలు, ఇతర జిల్లాల్లో స్థిరపడిన ఏడు కుటుంబాలకు చెందిన 60 మంది కుటుంబ సభ్యులు ఏటి పండుగలో సందడి చేశారు. అమెరికా నుంచి హోతా కుటుంబం, బెంగుళూరు నుంచి పంచాగ్నుల కుటుంబం, విజయవాడ నుంచి జాగర్లపూడి, జంగా కుటుంబాలు, గుంటూరు నుంచి కోట, వారణాసి కుటుంబాలతోపాటు విశాఖ నుంచి మాండలిక కుటుంబం, నెల్లూరు నుంచి పీసుపాటి కుటుంబం నుంచి దాదాపు 60 మందికిపైగా కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో దేవదాయశాఖ, ఇరిగేషన్, పోలీసు, నగర పాలక సంస్థ, విద్యుత్, అగ్నిమాపకదళంతోపాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఏటి పండుగ విజయవంతానికి సమష్టిగా కృషి చేశారు.నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, పలువురు టీడీపీ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన



పెన్నానీటిలో గొబ్బెమ్మలను నిమజ్జనం చేస్తున్న హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి వచ్చిన మహిళలు

కుటుంబ బంధాలు బలోపేతానికే...

కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు, ఆప్యాయతలు బలోపేతం అయ్యేందుకే ఏటి పండుగ అని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. గురువారం రాత్రి వెంకటేశ్వరపురం పెన్నా తీరంలో ఆయన ఏటి పండుగను ప్రారంభించారు. చిన్నారులు, యువకులతో కలిసి బెలూన్లు, గాలిపటాలు ఎగురవేశారు. మైదానమంతా కలియ తిరుగుతూ ముత్తైదువులు నిర్వహించిన గొబ్బెమ్మల నిమజ్జనాన్ని ఆసక్తిగా తిలకించారు. గొబ్బెమ్మ నోము విశిష్టతను అడిగి తెలుసుకున్నారు.అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఏటి పండుగకు తరలివచ్చిన దేవేరులను భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. తదుపరి మంత్రి నారాయణ తదితరులు పిండి వంటలు ఆరగించారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, డివిజన్ టీడీపీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్కాబావ వెంట వెళ్లి
మృత్యువాత

- అల్లుడు, కూతురు చనిపోవటంతో తల్లిదండ్రుల రోదన
- అనంతసాగరం గ్రామంలో విషాదం



యామిని మృతదేహం

కందుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా పరిధిలోని పాకల సముద్ర తీరంలో గురువారం సముద్ర స్నానానికి వెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతుల్లో ఒకరు కందుకూరు మండలం అనంతసాగరానికి చెందిన యువతి కావడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. అక్కా,బావలతో కలిసి సంక్రాం తిని ఆనందంగా జరుపుకున్న కొండాబత్తిన యామిని (14) ఈ ఘటనలో మృతి చెందింది. యామినితోపాటు ఆమె బావ కూడా మృతి చెందగా, ఆమె అక్క నవ్యను స్థానిక మత్స్యకారులు కాపాడగలిగారు.

కందుకూరు మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన కొండాబత్తిన సురేష్, సంపూర్ణ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తెను కందుకూరు మున్సిపాలిటీలోని దూబగుంటకు చెందిన యువకుడికిచ్చి పెళ్లి చేశారు. రెండో కుమార్తె నవ్యను పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీ శివన్నపాలెంకు చెందిన నోసిన మాధవకి ఇచ్చి వివాహం జరిపించారు. మూడో కుమార్తె యామిని అవివాహిత. ఆమె సంక్రాంతి పండుగకు కోసం చిన్నక్క ఇంటికి వచ్చి మూడు రోజులు ఆనందంగా గడిపింది. చివరిరోజు సముద్ర స్నానాలకు వెళ్తుండటంతో వారితో కలిసి వెళ్లిన యామిని మృతిచెందింది. దీంతో సురేష్-సంపూర్ణ దంపతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ముక్కుపచ్చలారని ఓ కుమార్తె మృతి చెందగా, మరోకుమార్తె భర్త చనిపోవటంతో వారిని ఓదార్చటం ఎవరితరం కాలేదు.

రేపటి నుంచే పక్షుల పండుగ

- సూళ్లూరుపేట కేంద్రంగా ప్రారంభ, ముగింపు వేడుకలు
- నేలపట్టు, అటకానితిప్పలో వ్యూ పాయింట్లు
- బీవీపాలెంలో పడవ షికారు.. శ్రీసిటీలో వర్క్‌షాపు
- తిరుపతి, నెల్లూరుల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కేంద్రంగా శనివారం నుంచి పక్షుల పండుగ జరగనుంది. వైసీపీ హయాంలో నాలుగేళ్ల పాటు ఈ వేడుకను ఆపేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు. మూడు రోజులపాట జరిగే ఫ్లెమింగో ఫెస్టివల్‌ను శనివారం ఉదయం సూళ్ళూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్ ప్రారంభించనున్నారని తిరుపతి జిల్లా కలెక్టరు వెంకటేశ్వర్ వెల్లడించారు. ఈ ఏర్పాట్ల గురించి గురువారం మధ్యాహ్నం జేసీ శుభమ్ బన్సాల్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణమూర్తి తదితరులతో కలిసి కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని, నిధుల కొరత లేదని స్పష్టం చేశారు.

● ఐదు చోట్ల ఉత్సవాలు

సూళ్లూరుపేట, నేలపట్టు, అటకానితిప్ప, బీవీపాలెం, శ్రీసిటీలలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహిస్తారు. పక్షుల అభయారణ్యమైన నేలపట్టు, అటకానితిప్ప ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పెలికాన్ కొంగలను మరో ఏడెనిమిది జాతుల విదేశీ పక్షులను వీక్షించొచ్చు. ఇప్పుడు పెలికాన్ కొంగలు గూళ్లు ఏర్పాటు చేసుకునే సమయం కూడా. దీనికోసం ఈ రెండు ప్రాంతాల్లో వ్యూ పాయింట్లు ఏర్పాటు చేసి బైనాక్యులర్స్‌ను అందుబాటులో ఉంచనున్నారు. నేలపట్టులో అదనంగా స్నేక్ షో ఉంటుంది. అటవీశాఖ నుంచీ 50 మంది గైడ్లను నియమించారు. బీవీపాలెం పడవల రేవులో పర్యాటకులు పులికాట్ సరస్సులో షికారు చేయడానికి 35 పడవలు సిద్ధం చేశారు. ప్రతి బోటులోనూ లైఫ్ జాకెట్లు, ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్లు ఉంటారు. ఈ ఐదు చోట్లా వైద్య శిబిరాలు, హెల్ప్ సెంటర్లు, భారీ బందోబస్తు, సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. తిరుపతి, నెల్లూరు జిల్లాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది.



వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

● శోభాయాత్ర

తొలిరోజు చెంగాలమ్మ ఆలయం నుంచీ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. ఉత్సవాల ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు మూడు రోజులూ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వైల్డ్ లైఫ్ ఫొటోగ్రఫీ పోటీలు కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. శ్రీసిటీ సెజ్‌లో మూడు రోజుల పాటు పులికాట్ పర్యావరణంపై వర్క్‌షాప్ నిర్వహిస్తోంది.

● 6-7 లక్షల మంది వస్తారని అంచనా

చివరిసారి 2020 జనవరిలో జరిగిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను మూడు రోజుల్లో ఐదు లక్షల మంది వీక్షించారు. నాలుగేళ్ల విరామం తర్వాత జరిగే ఈ ఉత్సవాలకు ఆరు నుంచీ ఏడు లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా.

● ఫ్లెమింగో ఫెస్టివల్ లోగో, వెబ్‌సైట్ల ఆవిష్కరణ

ఫ్లెమింగో ఫెస్టివల్ లోగోను, వెబ్‌సైట్‌ను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ వెబ్‌సైట్ శాశ్వతంగా ఉంటుందన్నారు. నేలపట్టు, అటకానితిప్ప, పులికాట్ సరస్సుల పర్యావరణానికి సంబంధించి ఆసక్తి వున్నవారు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి వివరాలు తెలుసుకునే వీలు కల్పించామన్నారు.

వెక్కిరిస్తున్న రహదారులు
సంక్రాంతి పోయినా.. యథాతథంగానే గుంతలు

సంగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతలమయంగా మారాయి. గత పాలకులంతా ఇసుక, గ్రావెల్ అక్రమ తరలింపుతో జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పనిచేశారు. ఈ క్రమంలో వారు రహదారుల గురించి పట్టించుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వయంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సంక్రాంతి నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రోడ్డే లక్ష్యంగా 'పల్లె పండుగ' పేరిట రూ. కోట్లాది రూపాయల నిధులను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు ప్రజాప్రతినిధులు, పాలకులను భాగస్వాములను చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని చోట్లా పల్లె పండుగ పేరిట రోడ్లపై గుంతలు లేకుండా చేస్తున్నారు. అయితే సంగం మండలంలో మాత్రం ఆ పనులు చేపట్టకపోవడంతో రహదారులు పాలకులను వెక్కిరిస్తున్నాయి.



గుంతలుమిట్టలుగా అన్నారెడ్డిపాళెం - మక్తాపురం రోడ్డు

ఇవిగో సాక్ష్యాలు..

- వంగల్లు - మర్రిపాడు రహదారి ఎప్పటి నుంచో గుంతలమయమై ఉంది. గతంలో ఆటో డ్రైవర్లు ఈ రోడ్డులో ప్రయాణం చేయలేక గుంతలను వారే మట్టితో పూడ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోయి యథావిధిగా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో పండగకు సొంతూర్లకు వచ్చే ప్రజలు, వాహనచోదకులకు ఇక్కట్లు తప్పలేదు.
- అన్నారెడ్డిపాళెం - మక్తాపురం రోడ్డుది కూడా ఇదే పరిస్థితి. ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డు ఐదు కిలోమీటర్ల పొడవుంది. తారంతా లేచిపోయి గుంతలమయమైయింది. కానీ కూటమి ప్రభుత్వం కూడా ఆ గుంతలు పూడ్చలేదు.
- ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న తరుణవాయి - చెన్నవరపాడు రోడ్డు ఎనిమిది కిలోమీటర్ల పొడవునా అడుగుకో గుంత ఏర్పడి ఉంది. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే వాహనచోదకుల ఇక్కట్లు తప్పడంలేదు.
- పల్లిపాళెం - సంగం రహదారి కూడా అధ్వానంగా ఉంది. ఈ రహదారి పంచాయతీరాజ్ ప్రాజెక్టు పరిధిలో ఉంది.
- పెరమన - జంగాలదొరువు రహదారిలో గత ఐదేళ్లలో వైసీపీ నాయకుల గ్రావెల్ దందాతో అధ్వానంగా తయారయింది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం రావడంతో అధ్వానంగా ఉన్న రహదారులు సంక్రాంతి నాటికి బాగుపడుతాయని గ్రామీణులు కలలు కన్నారు. సంక్రాంతి వెళ్లిపోయింది కానీ గుంతలు మాత్రం అలాగే ఉన్నాయి.

ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

● ఎమ్మెల్యే ఇంటూరి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు

కందుకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆరాధ్య దైవం దివం గత ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఈనెల 18న కందుకూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వెంగమాంబ కల్యాణ మండపంలో వర్ధంతి సభ, అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అభిమానులు, నందమూరి అభిమానులు అధికసంఖ్యలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, మాదాల లక్ష్మీనరసింహం, కొత్తూరి వెంకటసుధాకర్, మురారిశెట్టి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యులుగా చేరాలి : ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి



కావలి: సింగమనేని శేషగిరికి టీడీపీ శాశ్వత సభ్యత్వ కార్డు అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ ముసునూరుకు చెం దిన తెలుగుదేశం పార్టీ నాయకుడు సింగమనేని శేషగిరి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ముసునూరులోని ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి నివాసంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా సభ్యత్వ కార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను అభినందిస్తూ ఉత్సాహవంతులు టీడీపీ శాశ్వత సభ్యులుగా చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముసునూరు నేతలు పాల్గొన్నారు.

రైల్వే బిట్రగుంటకు పూర్వ వైభవం తీసుకువస్తాం

●బిట్రగుంట : రైల్వే బిట్రగుంటకు త్వరలో పూర్వవైభవం తీసుకువస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట క్రీడామైదానంలో యంగ్‌లైన్స్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జరిగిన సంక్రాంతి సంబరాల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిట్రగుంట రైల్వేప్రాంతంలో పరిశ్రమను ఏర్పాటుచేసేందుకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ప్రతిపాదన చేశామని అన్నారు. రైల్వే ఆర్‌ఓహెచ్ ఏర్పాటుకు దాదాపు పూర్తి కావచ్చిందని త్వరలో శుభవార్త వింటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు గండూరి మంజుల, జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్, టీడీపీ నేతలు ఎం నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వ రరెడ్డి, ఎల్ సుధీర్‌బాబు, యర్రం వేంకటేశ్వర్లు రెడ్డి, ముంతాల వెంకయ్య, కాండ్ర రఘురామనాయుడు, యంగ్‌లైన్స్ సభ్యులు తదితరులు ఉన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వాలపై శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే కాకర్ల



ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నుంచి సభ్యత్వ కార్డు అందుకుంటున్న శ్రీకాంత్‌యాదవ్

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ ముఖ్య నాయకులు గురువారం వింజమూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వం అందుకున్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్ యాదవ్‌తో పాటు జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, రామాపురంకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జి పోకా మహేష్, వరికుంటపాడుకు చెందిన బూత్ ఇన్‌చార్జి పోద మాధవరావు, అశోక్‌నగర్‌కు చెందిన వడ్లమూడి నాగేంద్ర సభ్యత్వ నమోదు కార్డులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాకర్ల మాట్లాడుతూ శాశ్వత సభ్యత్వంపై నాయకులు శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ ప్రస్తుతం శాశ్వత సభ్యత్వం అందుకోవడం ఎంతో అభినందనీయమన్నారు.

●సీతారామపురం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్ రాజు, మాజీ మండల ఉపాధ్యక్షులు సోమనబోయిన రాజశేఖర్ టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు.

క్రికెట్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



ఉదయగిరి: క్రికెట్ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్‌లో దేకూరుపల్లి, బిజ్జంపల్లి జట్లు తలపడగా, దేకూరుపల్లి జట్టు ప్రథమ, బిజ్జంపల్లి జట్టు ద్వితీయస్థానంలో నిలిచాయి. వారికి నిర్వాహకులు ప్రథమ, ద్వితీయ బహుమతుల కింద రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున నగదు బహుమతులు, మెమోంటోలు అందజేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ నాయకులు కాకు వెంకటయ్య, నాయబ్, బాషామొహిద్దీన్, కేవీ కృష్ణ, గ్రామపెద్దలు రాజగోపాల్‌రెడ్డి కల్లూరి రవీంద్రారెడ్డి, వీర్ల తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

●దుత్తలూరు: మండలంలోని కొత్తపేట గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గురువారం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాళ్లూరి దయానందం, ఐటీడీపీ కోఆర్డినేటర్ వెంగళరావు, గ్రామపెద్దలు మాల్యాద్రి, వెంగళరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

●అనంతసాగరం : మండలంలోని పడమటి కంబంపాడులో సంక్రాంతి సందర్భంగా హెల్పింగ్ హర్ట్స్ ఆధ్వర్యంలో డాక్టర్ జీఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గురువారం ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు రొండ్ల వెంకటరమాణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మురళి, సుదాకర్, నారసింహరెడ్డి పాల్గొన్నారు.

తరుణవాయిలో సంగమేశ్వరుడి విడిది

సంగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గిరి ప్రదక్షణకు బయలుదేరిన సంగమేశ్వరస్వామి గురువారం ఉదయం తరుణవాయి గ్రామంలో విడిది చేశారు. కొరిమెర్ల, తలుపూరుపాడులో గ్రామోత్సవం పూర్తిచేసుకుని తరుణవాయికి చేరింది. రాత్రికి తరుణవాయి గ్రామంలో గ్రామోత్సవం పూర్తయిన తరువాత ఉత్సవం శుక్రవారం ఉదయం సంగంకు చేరుతుంది. అనంతరం సంగం పురవీధుల్లో గ్రామోత్సవం పూర్తిచేసుకుని ఆలయానికి చేరనుంది.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం

మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న పోలేరమ్మతల్లి ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకు బుధవారం అర్థరాత్రి పోలేరమ్మతల్లి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కావలిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) పట్టణ కలుగోళమ్మపేటలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం రాత్రి పడిపూజ ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుగ్గిశెట్టి మాధవి, జ్వాలా రామ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు అమరా వేదగిరి, భవనాశి కృష్ణస్వామి, వేమా ప్రకాశం, కల్యాణ్ చక్రవర్తి, బొగ్గవరపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు కలిగిరి మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ ప్రత్యూష తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ప్రగతి పథంలో పల్లెలు

ముమ్మరంగా మురుగు కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణం
పల్లె ప్రజల ఆనందం



గన్నేపల్లి ఎస్సీ కాలనీలో నిర్మించిన సిమెంట్‌రోడ్డు



దుత్తలూరు మండలం జంగాలపల్లిలో వేసిన సిమెంట్‌రోడ్డు

ఉదయగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్‌రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 285 సిమెంట్ రోడ్లు పూర్తయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం పల్లె ప్రగతిని గాలికొదిలేసింది. కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులు తీరుతుండడంతో గ్రామాల్లో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల అభివృద్ధిని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని విస్మరించింది. ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి ప్రగతిని దూరం చేసింది. ఐదేళ్ల పాలనలో గ్రామాల్లోని అంతర్గత రహదారులు అధ్వాన్నంగా మారాయి. మురుగు కాలువల్లేక చిన్నపాటి వర్షం కురిసినా మురుగు నీరంతా రహదారులు, ఇళ్ల వద్ద నిలిచి అపరిశుభ్రతతో గ్రామీణప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్ రోడ్ల మంజూరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో ప్రజలు పడుతున్న బాధలను గుర్తించింది. సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారు. ఈమేరకు పల్లెపండుగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉదయగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకొని రూ.19.26 కోట్ల నిధులతో 334 సిమెంట్‌రోడ్లు మంజూరు చేయించారు.

శరవేగంగా పనులు : మణికుమార్, పంచాయతీరాజ్ డీఈ

నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ శరగవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేక చొరవ తీసుకుని నియోజకవర్గానికి అత్యధికంగా రూ.19.26 కోట్ల నిధులతో 334 సీసీ రోడ్లు మంజూరయ్యేలా కృషి చేశారు. ఇప్పటికే 285 రోడ్లు పూర్తిచేశాం. మిగిలిన రోడ్ల నిర్మాణాలు సైతం త్వరలో పూర్తి చేస్తాం.

అప్రమత్తతతోనే రోడ్డుప్రమాదాల నివారణ సాధ్యం

● ఎంవీఐ రాములు



ఆత్మకూరు: రహదారి భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఆత్మకూరు ఎంవీఐ రాములు తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఆవరణలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడుపుతున్న సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అతివేగం అనర్థదాయకమని, అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించేందుకు ఏటా భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్సు తీసుకుని వాహనాలను నడపాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు, సరైన పత్రాలు లేకపోవడం, మద్యం తాగడం తదితర అంశాలపై పోలీసులు చర్యలు తీసుకుంటున్నారంటే అందుకు కారణం రహదారి ప్రమాదాలను నివారించేందుకేనన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ షేక్ కరీమున్నీసా, ఏఎంటి రాజకుమార్, ఏఎంఎఫ్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో వాహనాలను నడపాలి : సీఐ

●ఉదయగిరి: డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సీఐ ఎస్.వెంకటరావు సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు అజాగ్రత్తగా ఉండకూడదని, ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. ఈ భద్రతా మాసోత్సవాలు వచ్చేనెల 16వ తేదీ వరకు నిర్వహించడం జరుగు తుందన్నారు. అనంతరం డిపో యాజమాన్యం సీఐ, ఎస్ఐలను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, గ్యారేజీ, ట్రాఫిక్ సిబ్బంది, యూని యన్ నేతలు పాల్గొన్నారు.

సురక్షిత డ్రైవింగ్ శ్రేయస్కరం

●కావలి: ఏకాగ్రతతో వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని కావలి డీఎస్పీ వీ శ్రీధర్ తెలిపారు. కావలి ఆర్టీసీ గ్యారేజ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు గురువారం డీఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురక్షిత డ్రైవింగ్ విధానాలు పాటించకపోతే ప్రయాణికుల కుటుంబాలతో సహా డ్రైవర్ కుటుంబం కూడా అవస్థలకు గురికావల్సి వస్తుందన్నారు. ప్రమాదాలు జరిగితే ఆర్టీసీ సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. డీపో మేనేజరు శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా నెల రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించటంలో డ్రైవర్‌తోపాటు సదరు బస్సు కండక్టర్ కూడా బాధ్యత ఉంటుందన్నారు. బస్సుల కండిషన్ల విషయంలో మెకానిక్‌ల పాత్ర కూడా కీలకమని వారికి కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్లకు తరచూ వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్, డిపో అసిస్టెంట్ మేనేజరు(ట్రాఫిక్) కల్పనారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ ఖాదర్‌మొహిద్దీన్, ట్రాఫిక్ సూర్‌వైజర్ రామకృష్ణ, మెకానికల్ సూపర్‌వైజర్ శీనయ్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డీ. రవిప్రకాష్, ఒకటో పట్టణ ఎస్ఐలు జానకి రామిరెడ్డి, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం



చిన్నారులకు బియ్యం, నిత్యావసరాలు అందచేస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కావలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బాలికలను చదివించి వారిని రక్షిద్దాం అని కావలి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. కావలి పట్టణ శాంతినగర్‌లో ఉన్న జేమ్స్ బాలికల హోమ్‌లో ఉన్న యారం ప్రశాంతి పుట్టినరోజు సందర్భంగా గురువారం ఆ హోమ్‌లో ఉన్న బాలికలకు బియ్యం, నిత్యావసరాలు అందచేశారు. సీఐ మాట్లాడుతూ బాలికలను చదివించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. లోక్‌సత్తా సభ్యుడు మాలకొండారెడ్డి మాట్లాడుతూ బాలికల రక్షణకోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌ల ద్వారా రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దేవిక, జేమ్స్ బాలికల హోమ్ నిర్వాహకులు మార్క్, నోటి ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్థుల సర్వేపై అవగాహన



కలిగిరి: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్యకేంద్రంలో గురువారం వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి కుష్ఠువ్యాధిగ్రస్థుల సర్వేపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరిశీలించాల్సి ఉందన్నారు. కుష్ఠు లక్షణాలు ఉన్న అనుమానిత కేసులను గుర్తించి పీహెచ్‌సీ వైద్య కేంద్రంలో సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, అశా కార్యకర్తలు, మేల్ వాలంటీర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి కమిటీ సమావేశం

స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి డా. బిజ్జం గీతారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ప్రాథమిక ఆరోగ్యవైద్యకేంద్రానికి కావలసిన వసతులు, అభివృద్ధి పనులపై సమీక్ష జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

● ఉదయగిరి : మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహించే అనుమానిత ఇంటింటా కుష్ఠువ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను పక్కాగా నిర్వహించాలని వైద్యాధికారిణి వినీత పేర్కొన్నారు. గురువారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సర్వే బృందం ప్రతిఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరీక్షించి శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలను గుర్తించి నమోదు చేయాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మర్రిపాడు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలుగా ఆక్రమణలు శీర్షికన ఈనెల 7వతేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండలంలో అక్రమార్కులు ప్రభుత్వ భూముల ఆక్రమణకు గొడవలు పడుతూ నిత్యం పోలీస్ స్టేషన్‌లకు పంచాయితీలు చేరుతున్నాయి. దీనిపై ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించి గురువారం పొంగూరు రెవెన్యూలోని 1011లో అక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటుచేశారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు అనీల్ కుమార్ హెచ్చరించారు.



ప్రభుత్వ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన



ఆత్మకూరు : వరి పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఆత్మకూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలో సాగులో ఉన్న వరి పంట పొలాలను గురువారం వ్యవసాయశాఖ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత శ్రీలక్ష్మీ మాట్లాడుతూ వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. గత ఏడాది నవంబరు 15వ తేదీకి ముందుగా రైతులు వరినాట్లు వేయడంతో పంట ఎదుగుదలలో వ్యత్యాసం వచ్చిందన్నారు. ముందుగా వెన్ను రావడం, దుబ్బలా ఉన్న మొలకలు వివిధ దశల్లో వంగిపోవడం జరిగిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకొనుటకు రైతులు యూరియా 300 కిలోలు, పొటాష్ 15కిలోలు పది రోజుల వ్యవధిలో రెండుసార్లు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డీఆర్సీ సహాయ వ్యవసాయ సంచాలకులు మారుతీదేవి, లక్ష్మీ మాధవి, ఆత్మకూరు ఏడిఏ వి దేవసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

●ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం సాగులో ఉన్న వరి, ఉలవ పంటలను మండల వ్యవసాయాధికారి ఆంజనేయులునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పంటలకు సోకిన తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. అనంతరం సచివాల యాల్లో రైతులతో సమీక్షా సమావేశం నిర్వహించి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ చల్లా పూజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

●ఏఎస్ పేట : వరి సాగులో తెగుళ్ల నివారణపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయ అధికారిణి రజని రైతులకు సూచించారు. గురువారం ఆమె పెద్దహబ్బీపురం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమై వరి సాగులో మెళకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 8 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరా

●షేక్ ఫిరోజ్, విద్యుత్ ఏఈ, లింగసముద్రం

ఈ వారం ముఖాముఖి



లింగసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్‌ను రెండు విడతలుగా కాకుండా పగలు 8 గంటల పాటు నిరంతరం సరఫరా చేస్తున్నామని మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్ తెలిపారు. అలాగే గ్రామాల్లో కూడా 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

? మండలంలో రైతులకు ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా ఇస్తున్నారు.

! ప్రతిరోజూ పగలు 8 గంటలు ఇస్తున్నాము. ఉదయం 8.45 గంటల నుండి సాయంత్రం 4.45 గంటల వరకు విద్యుత్ సరఫరా చేస్తున్నాము.

? రైతులకు త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని రోజులలో ఇస్తారు.

! రైతులు ఉదయం చెబితే సాయంత్రానికి ఇస్తాము.

? గ్రామాల్లో ప్రజలకు విద్యుత్ సరఫరా ఎలా చేస్తున్నారు.

! మండల కేంద్రం లింగసముద్రంతో పాటు గ్రామాలకు కూడా 24 గంటలు విద్యుత్ సరవరా చేస్తున్నాము.

? మండలంలో విద్యుత్ సబ్ స్టేషన్లు ఎన్ని ఉన్నాయి.

! నాలుగు ఉన్నాయి. లింగసముద్రం, మొగిలిచెర్ల, వీఆర్ కోట, చినపవని గ్రామాలలో సబ్‌స్టేషన్లు ఉన్నాయి.

? సిబ్బంది కొరత ఉందా.

! సిబ్బంది కొరత లేదు. ఎక్కడైనా ఏదైనా అవాంతరం వస్తే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరిస్తున్నాం.

న్యూస్ బాక్స్

క్రికెట్ కిట్ల అందజేత

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటలచెరువుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జనసేన ఆధర్యంలో క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన పార్టీ నాయకులు గుమ్మలంపాటి వెంగళరావు తన స్వంత నిధులతో గ్రామంలోని యువకులతో పాటు విద్యార్థులకు తన వంతు దాతృత్వంగా కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బత్తినవారిపల్లిలో వైద్యశిబిరం

వింజమూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాకలికొండ పంచాయతీ పరిధిలోని బత్తినవారిపల్లి గ్రామంలో చాకలకొండ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గతంలో ఆ గ్రామ ప్రజలు సీజనల్ జ్వరాలకు గురయ్యారనే ఫిర్యాదు మేరకు గురువారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారి మురళీధర్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కావలిటౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 1,2,3వ తేదీలలో నెల్లూరు నగరంలో జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం అయ్యేందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహాయ సహకారాలందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తిరు పాల్, కృష్ణమోహన్, బీ కృష్ణయ్య, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల ప్రారంభం

జలదంకి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జలదంకి పంచాయతీలోని గమళ్ళపాలెం, అరుంధతీవాడల్లో రూ.60లక్షల ఉపాదిహామీ నిధులతో పలు సిమెంటురోడ్ల నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. టీడీపీ మండల అధ్యక్షుడు పి మధు మోహన్‌రెడ్డి టెంకాయకొట్టి పనులు ప్రారంభించారు. అదేవిధంగా మండ లంలోని కొత్తపాలెం గ్రామంలో కూడా సిసిరోడ్ల పనులను టీడీపీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకట్రామిరెడ్డిలు ప్రారంభించారు. ఈ పనులు పిఆర్ఏఈ వాణి, గ్రామసచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో జరుగుతున్నాయి.

ఎక్కడంటే అక్కడ వాహనాలు ఆపడం సరికాదు

బిట్రగుంట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ఎక్కడంటే అక్కడ వాహనాలు నిలపడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎన్‌హెచ్ మొబైల్ సిబ్బంది అన్నారు. బోగోలు మండలం కడనూతల జాతీయ రహదారి చెరువు గట్టు వద్ద ప్రయాణికులు కొందరు కార్లను నిలుపుకుని సేదతీరుతుండటం చూసి గురువారం హెచ్చరించారు.